# పొద్దు తిరగని పూలు

నవల

– శ్రీ రుద్ర



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 239

కౌముది మాసపత్రికలో

జనవరి 2022 సంచిక నుంచి సెప్టెంబర్ 2022 సంచిక వరకూ

వచ్చిన సీరియల్ నవల

*(ప్రారంభం)*

**ఈ రోజు చలి** బాగా తగ్గి ఉదయాన బయట వెచ్చగా హాయిగా ఉంది. మెల్లగా నా అడుగులు ఇంటి ఆవరణ లోని చెట్ల వైపు దారి తీసాయి. చెట్ల ప్రక్కన గూడులో పెద్ద కత్తెర తీసి అడ్డదిడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మలను కత్తిరించడం మొదలుపెట్టాను.

ముందుకు వెళ్లి, బాగా గుబురుగా పెరిగిన పెద్ద తమలపాకు తీగను సవరిస్తున్నాను. అవకాశమున్న చోటల్లా తన వ్రేళ్ళను ఆసరాగా ఉన్న గోడలోకి చొప్పించుకు వెళ్ళిపోయిందీ తీగ. లోపలికి చేయి జాపి దొరికిన ఎండు కొమ్మలను ఆకులను తీసివేస్తున్న నేను అకస్మాత్తుగా ఒక వింత అనుభూతికి లోనయ్యాను.

అప్రయత్నంగానే నా స్మృతి వృక్షంలోకి జొరబడిన నేను మలగిన ఒక గాఢ స్మృతిని స్పృశించడం జరిగింది.

ఔను! ఈ తమల తీగ, నా స్మృతి దొంతరల ముడి విప్పింది.

ఇంతలో నా చెవిలో "ఒరేయ్ శ్రీమన్, నేన్రా విజయ్ బాబుని. నన్నంత సులభంగా పెకలించలేవురా నీ స్మృతిలోంచి" అన్నట్టనిపించింది.

విజయ్ బాబు. నాలో ఒక విద్యుత్తు పాకి అతని జ్ఞాపకాలు లిప్త పాటులో చుట్టు ముట్టాయి. విజయ్ బాబు గురించి ఆఖరి సారి విన్నది దాదాపు ముప్ఫయి ఏళ్ళ క్రితం!

ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటల సమయమది. రెండేళ్ల మా అమ్మాయి జ్యోతి ప్రొద్దున వచ్చింది వాళ్ళ తాతగారి ఊరి నుంచి. ఆవరణలో తిరుగుతూ చిన్న చిన్న పదాలతో ఏవో పాటలు పాడుతోంది.

ఇంతలో "నాన్నా! నాన్నా!" అంటూ నా దగ్గరికి వచ్చి బయట గుమ్మం వైపు చూపించింది. ఎవారాని చూసే సరికి హడావిడిగా జోగారావు కనిపించాడు.

చావు కబుర్లు ఇంకా సంచలన విషయాలు చేరవేస్తూ ఆనందపడే జోగారావు ఈ వేళప్పుడు వచ్చాడేంటబ్బా అని సంకోచిస్తూ ముందుకు వెళ్ళాను.

"నీకు తెలిసిందా?" అని అడిగాడు జోగారావు. ఏంటని అడిగాను.

"బాబురావు చనిపోయాడు ఇవాళ రామ్ నగర్ లో. నేను అక్కడి నుంచే వస్తున్నాను. అంత్యక్రియలు ఇంకొద్ది సేపట్లో ముగుస్తాయి రామ్ నగర్ స్మశాన వాటికలో" అన్నాడు జోగారావు.

నిర్ఘాంతపోయిన నేను కమలాపురిలో ఉంటున్న బాబురావు వాళ్ళ అక్క సుగుణగారికి ఈ విషయం ఎలా చెప్పాలని కంగారు పడుతుండగా, జోగారావు "సరే! నేను మిగతా వాళ్ళకి కూడా తెలియజేస్తాను" అని వెంటనే వెళ్ళిపోయాడు.

పరుగున సుగుణగారి ఇంటికి వెళ్లిన నేను గుండె చిక్క పట్టుకుని ఆవిడకి "మీ తమ్ముడు బాబు పోయాడట క్రొద్ది సేపటి క్రితం రాంనగర్లో" అని చెప్పాను. ఆవిడ నిశ్చేష్టురాలైంది. కొద్ది సేపటి దాకా నోట మాట పెగల్లేదు. రెండేళ్లక్రితమే తన భర్త రాఘవరావు అకాల మరణంతో కృంగిపోయిన ఆవిడకి ఈ వార్త అశనిపాతమైంది.

నేను ఒక గ్లాసులో నీళ్లందించాను కానీ ఆవిడ తీసుకోలేదు. ప్రక్కనే ఉన్న కుర్చీలో కూలబడి కళ్ళు మూసు కుంది. "శ్రీమన్! నా తమ్ముడు తుది శ్వాస దాకా తన వాగ్దానం నిలబెట్టుకున్నాడు. కానీ నా స్వయంకృతానికి ప్రాయశ్చిత్తం లేదు" అని ఆవిడ ఏడుస్తూ అనింది. సుగుణ గారు అన్న మాటకి అప్పటికి నాకు అర్థం తెలీదు.

కొంచెం సేపటికి తేరుకున్న సుగుణ గారు "ఇక నా వాళ్ళెవరూ మిగలలేదు. ఉన్న ఒక్క బంధం కూడా తెగి పోయింది. వాళ్ళ బావ అర్ధంతరంగా పోయారు. వీడి జీవితం కూడా యాభై ఏళ్ళైనా నిండకుండానే ముగిసిపోయింది" అని భోరుమని విలపించింది.

విజయ్ బాబు ఉరఫ్ బాబూరావుని నేను చిన్నప్పటినుండి ఎరుగుదును. నా కంటే పద్దెనిమిది ఏళ్ళు పెద్దతను.

సుగుణ గారబ్బాయి వంశీ ద్వారా నాకు విజయ్ బాబు పరిచయం. సుగుణ గారిల్లు మా ఇంటికి దగ్గర్లోనే ఉండేది.

వంశీ నేనూ సమ వయస్కులం అలాగే ఒకే బడిలో చదివేవాళ్ళం. ఇంటి దగ్గర రోజూ కలిసి ఆడుకోవడం వలన వంశీ నాకు బాగా త్వరగా ఆత్మీయుడయ్యాడు. అలా వంశీ బంధువులతో పాటు వాళ్ళ మావయ్య విజయ్ బాబు కూడా నాకు బాగా తెలుసు.

విజయ్ బాబు ప్రతిభావంతుడు, చురుకైన వాడు. చక్కటి దస్తూరితో వ్రాయడంతో పాటు మంచి చిత్రాలు కూడా వేసేవాడు. కానీ జీవితంలో మాత్రం దారి తప్పి తన గమ్యాన్ని కోలేకపోయాడు. దీనికి కారణమేమిటని చిన్నప్పటి నుండి నా బుర్రలో తొలుస్తుండేది.

ఐతే విచిత్రంగా ఈ తమల తీగ దగ్గర ఈ రోజు మళ్ళీ బాల్యంలో నాకు విజయ్ బాబు గురించి తెలిసిన సంఘటనలు నన్ను చుట్టు ముడుతున్నాయి. నా జ్ఞాపకాలకు విరామమిస్తూ తమల తీగ నుంచి ఆర్ద్ర స్వరంతో విజయ్ బాబు

"శ్రీమన్! నీతో నా ఆవేదన వ్యక్త పరచాలనుకుంటున్నాను. నా దురదృష్ట జీవితానికి కారణమైన ఎన్నో బలమైన సంఘటనలను, అనుభవాలను నీ ద్వారా ఇతరులకు తెలియజేయాలనుకుంటున్నాను. నా ప్రతిభా పాటవాలు నన్ను అందలమెక్కించకపోగా నా బలహీనతలే కొండంతలుగా కనిపించి నన్ను చరిత్ర హీనుడిగా నిలబెట్టాయి. ఈ సమాజంలో నా ఉనికి ఎప్పుడో కనుమరుగైనా నా జీవిత పాఠాలు కొందరికైనా మార్గదర్శనం చెయ్యాలని ఆశిస్తున్నాను" అన్నట్లు వినిపించింది.

విజయ్ బాబు నాతో మళ్ళీ "నా స్వగతాన్ని నువ్వు ఇక్కడకు వీలైనప్పుడెప్పుడొచ్చినా ఆవిష్కరిస్తాను" అన్నట్లనిపించింది.

ఈ విచిత్రానుభూతి నుంచి నేను తేరుకునేలోగా "ఏవండీ! మీ టిఫిన్ చల్లారిపోతోంది. ఏం చేస్తున్నారు అంత సేపు అక్కడ ఆ చెట్ల దగ్గర" అని నా శ్రీమతి మంజరి నుండి బిగ్గరగా పిలుపొచ్చింది.

ఉలిక్కిపడి నేను నా ఆలోచనలను వీడి వడిగా ఇంట్లోకి అడుగులు వేసాను. అప్పుడే ఆ తమలపాకు తీగ నుంచి కొన్ని పెద్ద ఆకులు వెంటనే రాలడం గమనించాను. ఇది జరిగిన తర్వాత రోజు నేను మళ్ళీ ఆ తమల తీగ దగ్గరకి వెళ్లి క్రితం స్పృశించిన చోటే మళ్ళీ ఆసక్తిగా తడిమాను.

"శ్రీమన్. త్వరగానే తిరిగి వచ్చావే! నా జీవిత కథని నా చిన్నప్పటి నుంచి జరిగినది క్రమంగా చెబుతాను విను" అని విజయ్ బాబు చెప్పటం మొదలు పెట్టాడు.

## *విజయ్ బాబు స్వగతం*

విజయ్ బాబు తన కథని చెబుతున్నాడు

"శ్రీమన్! జీవితంలో నా తొలి మజిలీ బెల్లంపల్లిలో. అది పంతొమ్మిది వందల నలభైల కాలం. నాకు గుర్తున్న నాలుగైదేళ్ల వయస్సప్పటి జ్ఞాపకమేమిటంటే అప్పటికి కొంత కాలం క్రితమే నేను సుగుణక్క బెల్లంపల్లిలో సాంబశివరావు గారింట్లో చేర్చబడ్డాము. వారింట్లో మా ప్రవేశం గూర్చి చెప్పాలంటే చాలా దుఃఖంగా, భారంగా ఉంటుంది.

నేను పుట్టిన ఏడాదికే మా అమ్మ చనిపోవడం వల్ల మా నాన్న సీతాపతిరావుకి మేనమామైన సాంబశివరావు తాతగారు మమ్మల్ని పిఠాపురం నుండి బెల్లంపల్లి రప్పించారు. నాన్నకి సికింద్రాబాదులో రైల్వే ఆఫీసులో ఉద్యోగం ఇప్పించి ఆయన తన పెద్దమ్మాయి కమలనిచ్చి మళ్ళీ పెళ్లి చేసారు.

ఈ పుణ్యంతో బాటు తన కూతురు కమల కష్ట పడుతుందని చిన్న పిల్లలమైన నన్ను, సుగుణక్కని ఆయన దగ్గర పెంపకానికి ఇక్కడ బెల్లంపల్లిలో ఉంచారు. నాకు గుర్తున్నఈ సమయానికి ఇక్కడొక పెద్ద బంగళాలో సాంబశివరావు తాతగారు, ఆయన భార్య పార్వతమ్మ, వాళ్ళ పిల్లలు రమ, కేశవ, చిట్టి, సుమతి ఇంకా ఆయన తల్లిగారు ఉన్నారు.

సింగరేణి కాలియరీస్ వారి ముఖ్యమైన బొగ్గు గని బెల్లంపల్లి క్షేత్రంలో లేబర్ ఆఫీసర్ హోదాలో ఉన్న సాంబశివరావు తాతగారికి పెద్ద బంగళా, కారుతో బాటు నౌకర్లను కూడా ఉద్యోగ సంస్థ ఆయనకి అమర్చింది.

చిన్నప్పుడు నేను అమ్మా అని ఎవరిని పిలిచానో గుర్తు లేదు. నాకు ఊహ వచ్చేసరికి పార్వతమ్మగారిని అమ్మమ్మా! అని పిలవటం గుర్తుంది. అది కూడా పార్వతమ్మగారిని నేను అమ్మమ్మా అని ఎందుకు పిలవాలి? అమ్మా అని ఎందుకు పిలవకూడదో నాకు నాలుగేళ్లప్పుడు చిట్టి చెబితే తెలిసింది.

చిట్టి చెప్పాడు "ఒరే! బాబూరావ్ మీ అమ్మ చిన్నప్పుడే హరీ! అంది రా" అని.

అదేంటో అర్ధమవ్వకపోయినా నాకు స్పష్టత వచ్చిందేంటంటే నాకు ఇంకా నా అక్కకి అమ్మ లేదని. చిన్నప్పటినుండి భుక్తికి కష్టం లేకపోయినా నాకు ఇష్టమైనదేది అడగడానికి మాత్రం వీలుండేది కాదు.

మిగతా చిన్నపిల్లల్లా ముద్దు ముచ్చటలాంటివేమి నేనూ అక్కా ఎరుగము. పాపం! అక్క చిన్నప్పుడే పెద్దదై పోయి అమ్మమ్మకి ఇంటి పనులలో సహాయం చేస్తుండేది. ఆడ పిల్లలకి త్వరగా వచ్చే అర్ధం చేసుకునే గుణం, తప్పనిసరి సర్దుబాటుతనంతో బ్రతికేస్తోంది.

కష్టమల్లా నాకే! మన అనుకునే అమ్మా, నాన్నా దగ్గర లేకపోవడం, పసి పిల్లల వరాలైన తల్లిదండ్రుల గారం, ముద్దు మురిపాలు ఏవీ దొరకని నాకు ఎలా బ్రతకాలో తెలియక చాలా ఏడుపొచ్చేది. అమ్మ ఒడి, లాలన నాకెప్పుడూ అనుభవంలోకి రాలేదు.

ఇవాళ అమ్మమ్మ మళ్ళీ గట్టిగా కసురుకుంది "పోరా! దరిద్రపు వెధవా" అని. సుమతి, పిన్ని వరసైనా నా కంటే మూడేళ్లే పెద్దది. తను తింటున్న లడ్డు నాకింకోటి కావాలని అడిగినందుకు అమ్మమ్మ నన్ను తిట్టింది.

ఎగిసి వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ బయటికి దూరంగా పరుగెత్తి ఇదిగో, ఎప్పటిలా ఒక చెట్టు క్రింద బండ రాయి మీద కూర్చుని ఏడుస్తున్నాను "అమ్మా! నువ్వెక్కడున్నావ్? నన్నెందుకు వదిలి వెళ్లావ"ని.

అక్క వచ్చి "బాబూ! ఏంట్రా ఇక్కడ కూర్చుని ఏడుస్తున్నావ్? ఇదిగో నా లడ్డూ తీసుకో" అంటూ నా తల నిమిరి చేతిలో తన లడ్డు పెట్టింది. ఇలా నేను ఇంట్లో వాళ్ళ మీద అలిగి దూరంగా వెళ్ళిపోయి ఏడుస్తున్నప్పుడల్లా అక్క వెతికి నన్ను పట్టుకుని ఇంటికి తీసుకొచ్చి సముదాయించేది.

ఈ బంగళాలో తాతగారు, అమ్మమ్మ ఎప్పుడూ ఇంటికి వచ్చిపోయే వాళ్ళతో తీరిక లేకుండా ఉండేవారు. నాన్న కూడా మా దగ్గరకి రావడం ఎప్పుడో జరిగేది.

అక్క నాకు చెప్పింది. నాకింకా పూర్తిగా ఊహ తెలియనప్పుడు నాన్న అమ్మతో పాటు వచ్చి వెళ్లాడని.

అప్పుడే అమ్మ మొదటి కాన్పుకి పుట్టింటికి వచ్చిందిట, మాకు క్రొత్త చెల్లెలు సుభద్ర పుట్టిందట. ఆ తరువాత నాకు కొంచెం జ్ఞాపకమున్న సమయానికి పెద్ద పిన్ని రమ పెళ్లి జరిగింది. నాకు గుర్తున్నది నాన్నని చూడటం అప్పుడు బెల్లంపల్లికి పెళ్ళి కోసం వచ్చినప్పుడే. పెళ్ళికి ఎంతో దూరాలనుంచి చుట్టాలు చాలామంది వచ్చారు.

ఈ పెళ్లిలోనే నేను మొదటిసారి ఫోటో దిగాను. పెళ్లి కూతురు, పెళ్లి కొడుకుతో పాటు పెళ్ళికి వచ్చిన దగ్గర బంధువులు దాదాపు యాభై మందితో తాతగారు ఎన్నో తరాలు గుర్తుంచుకునే ఒక చక్కటి ఫోటో తీయించారు. అది మాకొక అపురూప చిత్రంగా మిగిలింది.

పెళ్ళికి వచ్చిన వాళ్లలో ముప్పై మంది దాకా పిల్లలం మేము పోగయ్యాము. ఇక పెళ్లిలో మా హడావిడి ఇంతా అంతా కాదు. ఈ పెళ్లప్పుడే తెలిసింది నాకు ముగ్గురు మేనత్తలున్నారని. వాళ్ళని చూడటం అదే మొదటిసారి. వాళ్ళు కూడా చంకన పిల్లలతో పెళ్ళికి వచ్చారు.

పెళ్లికి వచ్చిన అమ్మ "కమల"ని చూస్తే చాలా బావుందనిపించింది. కొంచెం ఊహ వచ్చింది కానీ ఆవిడని అమ్మా అని బెరుకుగానే పిలిచేవాడిని. అమ్మది ఎక్కువగా మాట్లాడే స్వభావం కాదు. అమాయకంగా ఉండేది.

పెళ్ళైపోయిన తరువాత రమ పిన్ని హైద్రాబాదుకి తన అత్తారింటికి వెళ్ళిపోయింది. వాళ్ళతో బాటే అమ్మా, నాన్నా ఇంకా ఇతర బంధువులందరూ వాళ్ళ ఊళ్లకు వెళ్లిపోయారు. కేశవ, చిట్టి నా కంటే ఎనిమిదారేళ్ళు పెద్ద వాళ్ళు. వీళ్ళతో పాటు సుమతి, సుగుణక్కతో కలిసి నా ఆట పాటలు గడిచేవి. మమ్మల్నందరినీ బెల్లంపల్లిలోని ఒకే మిషనరీ స్కూల్లో చేర్పించడం వల్ల అందరం తాతగారి కార్లో బడికి వెళ్ళే వాళ్ళం.

తాతగారు అందరిని బాగా చదువుకోమని చెబుతుండే వారు. అమ్మమ్మకి మాత్రం ఇంట్లో ఎప్పుడూ బోలెడు పనులుండేవి. కేశవ చురుకు కాకపోయినా శ్రద్ధగా, పుస్తకాల పురుగులా చదువుతుండే వాడు. ఇక చిట్టి చదువు సంధ్యల కన్నా ఆటల మీదా, మిగతా పిల్లల్ని ఆట పట్టించడం పట్ల బాగా చురుకుగా ఉండేవాడు.

చిన్నప్పటినుండీ ఏ పని చెయ్యాలన్నా నేను ఎడమ చేత్తోనే చేసేవాడిని. దీంతో పిల్లలందరూ నన్ను ఎగతాళి చేస్తుండేవారు పుర్ర చెయ్యోడు, తొంటకలి గాడని. ఎడమ చేతి వాటమున్న పిల్లలని మా చిన్నపుడు ఇక్కడ అలా పిలిచేవారు. నేను ఏ వస్తువైనా ఎడమ చేత్తో ఇవ్వటాన్ని అశుభమని పెద్ద వాళ్ళు భావించేవారు.

నేనిది కావలిసి చేయటం లేదని, నాకు అప్రయత్నంగానే ఎడమ చేయి పని చేస్తుందని చెప్పినా వినిపించుకునే వారు కాదు.

ఇక నేను వ్రాయటం కూడా ఎడమ చేత్తోనే చేసేవాడిని. ఇంట్లో పెద్దవాళ్ళు ఇది మానమని నా చేతి వేళ్ళ మీద ఎన్నోసార్లు కొట్టి బలవంతంగా నా చేతి వ్రాతని కుడి వైపుకి మార్చారు. ఈ నిర్బంధపు చర్యల వల్ల నాకెంతో ఇబ్బంది కలిగేది. దీని ప్రభావం నా మస్తిష్కంపై ఎలా ఉంటుందో ఎవ్వరికీ అవగాహన లేకపోయింది.

ఇంత ఇబ్బంది పడ్డా ఎంతో కష్టపడి నేను త్వరలోనే కుడి చేత్తోనే ముచ్చటగా వ్రాయటం నేర్చుకున్నాను. చక్కగా బొమ్మలు కూడావేయటం మొదలెట్టాను. ఐతే వీళ్ళెవరూ దీన్ని గుర్తించకపోగా, అవకాశమొచ్చినప్పుడల్లా నా ఎడమ చేతి వాటాన్ని గేలి చేయటం మాత్రం పరిపాటైంది. మందలో పశువులా, ఒక ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో పిల్లవాడిలాగా నా ప్రతిభకి, పట్టుదలకు తగ్గ గుర్తింపు, ప్రోత్సాహం ఉండేది కాదు.

తాతగారు పొడుగ్గా, మంచి విగ్రహ పుష్టి ఇంకా వర్చస్సుతో ఉండేవారు. ఆయనంటే ఉద్యోగులు, పనివాళ్ళు ఇంకా చుట్టాలు తో గౌరవంగా ఉండేవారు. కానీ ఆయన గంభీరమైన ప్రవర్తన ఇంకా క్రమశిక్షణ మాత్రం చిట్టి మీద అంత ప్రభావం చూపలేదు. తాతగారికి ఇష్టం లేని పనులు కనపడకుండా చేసేవాడు.

చూడటానికి చిట్టి అమాయకంగా కనపడేవాడు కానీ ఎన్నో గడుసు పనులు, చేతి వాటం ప్రదర్శించేవాడు. తాతగారితో తరచు చీవాట్లు తిన్నా తన ప్రవర్తన మార్చుకునేవాడు కాదు. అమ్మమ్మ కూడా చిట్టికి వత్తాసు పలికేది.

చిట్టి నన్ను భయపెట్టి లోబరుచుకుని తను చేసే అల్లరిలో, చిల్లర దొంగతనాలలో నన్ను భాగస్వామిని చేసేవాడు. మెల్లగా నేను కూడా చెడ్డ పిల్లల జాబితాలో చేరిపోయాను. దీని పర్యవసానం నా జీవితం మీద ఎంత గాఢంగా ఉంటుందో ఎవరూ ఊహించలేకపోయారు. అస్సలు నా గురించి అంత దీర్ఘంగా ఆలోచించే తీరిక, బాధ్యత నన్నొదిలేసిన నాన్నకు గాని పెంపకానికి తీసుకొచ్చిన తాతగారికి గానీ లేకపోయింది.

కాలం గడిచిపోతోంది. ఇక్కడ ఇంట్లో మాత్రం ఎప్పుడూ సందడే. ప్రతి ఏడాది ఒకరి తరువాత ఒకరు అమ్మ, రమ పిన్ని కాన్పుల కోసం వస్తుండేవారు. వీరు కాకపోతే తాతగారి మిగతా బంధువుల రాకతో ఇంట్లో ఎప్పుడూ కోలాహలంగా ఉండేది. ఊహ తెల్సిన తరువాత నేనెప్పుడూ బెల్లంపల్లి దాటి వెళ్ళలేదు. కానీ ఊళ్ళో ఉండే రైల్వే స్టేషన్ ఇంకా అక్కడ వచ్చే రైళ్లను చూడాలంటే చాలా ఉత్సాహంగా ఉండేది. నేనెప్పుడు రైలెక్కుతానా అని ఉబలాటంగా ఉండేది.

నాన్న ఎప్పుడైనా ఇక్కడికి వచ్చినప్పుడు నాన్నతో వెళ్లి క్రొత్త ప్రదేశాలు చూడాలన్న ఆశ ఉండేది. కొన్నాళ్ళకు అనుకోకుండా నా కోరిక ఒక విధంగా తీరింది.

**నాకు అప్పటికి** ఐదేళ్ల వయస్సుంటుందేమో. తాతమ్మ ఒక రోజు మా అందరికీ ప్రొద్దున పాయసం చేసి పెట్టారు. ఏమిటి విషయం అంటే మన దేశానికి స్వతంత్రం అనేదేదో వచ్చిందని తెలిసింది. తాతమ్మగారు స్వాతంత్ర్య పోరాటంలో

పాల్గొని ప్రజానీకాన్ని తన ప్రసంగాలతో ఉత్తేజితుల్ని చేసేవారట. అప్పటికే డెబ్బై ఏళ్ళు సమీపించిన ఆవిడ ఆ రోజు ఎంతో ఉత్సాహంగా "జై భారత్ మాతాకీ, జై హింద్" అంటూ ఎంతో ఆనందంగా చప్పట్లు కొడుతూ ఇల్లంతా తిరిగారు.

ఇది జరిగిన కొన్నాళ్ళకే మా ఊళ్ళో కొంత మంది హడావిడిగా ప్రవర్తించడం గమనించాను. అప్పుడు జరిగిన సంఘటనలు తలచుకుంటే చాలా కాలం గుండె దడ పుట్టేది మా ఇంట్లో వాళ్లందరికీ.

ఒక రోజు మేము పిల్లలం ఆడుకునే మైదానం దగ్గరకి గుర్రాలపై కొంత మంది గమ్మత్తైన టోపీలు పెట్టుకుని గడ్డాలున్నవాళ్ళు వచ్చారు. వాళ్ళు మమ్మల్ని గుర్రుగా చూసి "ఛలో నికల్ యహా సే" అని అదిలించారు.

మిగతా పిల్లలు "అరే తుర్కీలు రా!" అంటూ మెల్లిగా చెవిలో చెప్పేసరికి మేమందరం భయంతో దౌడు తీసి ఇంటికి చేరుకున్నాము. ఇంట్లో పెద్దవాళ్ళు కూడా ఇక బయటికెళ్లకండి. ఆ రజాకార్లు వచ్చారు చంపేస్తారని భయపెట్టారు.

ఆ రోజు సాయంత్రం తాతగారి క్రింద పని చేసే కొంత మంది ముస్లిం కార్మికులు ఇంటికి వచ్చి "రావ్ సాబ్ జాగ్రత్తగా ఉండండి. రజాకార్ల మూక వస్తోంది" అని చెప్పి వెంటనే పరుగెత్తుకెళ్లి పోయారు.

తాతగారు వెంటనే అప్పటికే చీకటి పడుతున్న సమయాన మమ్మల్నందరిని లోపల ఒక గదిలో చేర్చారు. దీపాలన్నీ ఆర్పేసి కిటికీలు, తలుపులు మూసేసి ఏ మాత్రం చప్పుడు చేయకుండా నిశ్శబ్దంగా ఉండమని గట్టిగా చెప్పారు.

తాతగారు ముందు గదిలో కూర్చున్నారు. పనివాళ్లను వాకిలి దగ్గర కాపలా ఉంచారు. ఇంతలో తాతమ్మ తను కూడా వెళ్లి ఆ గదిలో పడక కుర్చీ వేయించుకుని అక్కడినుంచి వీధి వైపు కనపడేటట్లు కూర్చున్నారు. బాగా చీకటి పడింది. చిన్న లాంతరు వెలుగు మాత్రమే ముందు గదిలో ఉంది.

ఇంతలో దూరం నుంచి పెద్ద అరుపులతో బాటు కాగడాలతో గుర్రాల మీద రజాకార్లు రావటం చూసిన పనివాళ్ళు, బయట గేటు దగ్గర నుంచి పరుగెత్తుకుంటూ లోపలకొచ్చి గజ గజలాడుతూ వాళ్ళ గురించి చెప్పారు.

అంతే! తాతమ్మ తాతగారిని కూడా వెంటనే లోపలికెళ్ళమని గదమాయించారు. ఆయనని దాదాపు లోపలి గదిలోకి తోసినంత పని చేసి ముందు గుమ్మం పక్కన పడక కుర్చీ జరుపుకుని కూర్చున్నారు.

కొన్నిక్షణాలకే రజాకార్ల బృందం గేటు దగ్గరకొచ్చి "కౌన్ హై అందర్?" అంటూ వాళ్ళ ఆయుధాలను గేటు మీద తాటించారు. తాతమ్మ చేతిలో లాంతరు తీసుకుని గుమ్మం దగ్గర నిలబడి, కొంగుని తల పైకి కప్పుకుని "కౌన్ హై జనాబ్" అంటూ బదులిచ్చింది. చాలా భాషలు నేర్చుకున్న తాతమ్మ ఉర్దూ కూడా మాట్లాడేది.

ఆ వచ్చిన వాళ్ళు "అందర్ సే సబ్ లోగ్ బాహర్ ఆవ్" అని అరిచారు. దానికావిడ మా పనివాడైన యాదగిరిని "అరే దస్తగీర్! జాకే బోల్, ఘర్ కే లోగ్ సభీ లష్కర్ గయే షాదీ కే లియే" అని వాళ్ళు వినేటట్లు బిగ్గరగా అరిచింది. అది విని వాళ్ళు ఏదో తిట్టుకుంటూ అటూ ఇటూ చూసి, అక్కడినుంచి వెళ్ళిపోయారు. తరువాత వాళ్లు పూర్తిగా వెళ్ళిపోయారని నిర్ధారించుకున్న తాతమ్మ, తాతగారిని పిలిచి వెంటనే అందరూ ఇక్కడ నుంచి బయల్దేరాలని చెప్పింది.

ఇదంతా చూస్తున్న నాకెంతో ఆశ్చర్యమేసింది. ఎందుకంటే వందలాది కార్మికులను నియంత్రించే తాతగారిని కూడా ఈ పెద్దావిడ మార్గదర్శనం చేస్తూ, ఈ భయంకర సమస్య నుంచి బయటపడే చర్యలు మొదలు పెట్టింది. ఇంకా నాకు అబ్బురమేమనిపించిందంటే దీనికి తాతగారేమి అడ్డు చెప్పక వెంటనే వీటిని అమలు చేయటం.

ఈ సమయంలో సికంద్రాబాద్ వెళ్ళటం కూడా సురక్షితం కాదని హైదరాబాద్ స్టేట్ సరిహద్దున కొత్తూరులో తన చుట్టాలింటికి అందరిని చేర్చాలని తాతమ్మ ఆదేశించింది. మర్నాడే మమ్మల్నంతా చిన్న చిన్న బృందాలుగా చేసి రైలు, బస్సు, బళ్ళు ఏది వీలైతే అది ఉపయోగించి కొంత మంది పని వాళ్ళ తోడుతో అక్కడికి చేర్చారు.

ఇంట్లో పెద్ద వాళ్ళందరూ బిక్కు బిక్కుమంటూ భయపడుతున్నా నాకు మాత్రం రైలెక్కడం, బళ్ళ మీద వెళ్లడం చాలా ఉత్సాహమనిపించింది. ఏదైతేనేం కొన్నాళ్ల పాటు క్రొత్త ఊళ్ళో బడి గొడవ లేకుండా పిల్లలందరం గడిపేసాం.

రెణ్ణెల్ల తరువాత మాకందరికీ పెద్ద సంతోషకరమైన వార్త తెలిసింది. రజాకార్లతో పాటు నిజాం పాలన నుంచి

హైదరాబాద్ రాష్ట్రం విముక్తి చెంది స్వతంత్ర భారత దేశంలో విలీనమైందని. అంతటా సంబరాలు జరుపుకున్నారు.

స్వేచ్ఛగా మేము కూడా అందరం తిరిగి బెల్లంపల్లి చేరుకున్నాము.

నిజాం నవాబు పాలన ముగియటంతో ప్రాంతీయంగా క్రొత్త ప్రభుత్వం వచ్చింది. తాతగారు పని చేసే సంస్థలో కూడా మార్పులు జరిగాయి. బెల్లంపల్లితో బాటు క్రొత్తగూడెంలో కూడా బొగ్గు తవ్వకం మొదలవ్వటంతో తాతగారు అక్కడకి కూడా వెళ్లి పనులు చెయ్యటం మొదలైంది.

కొన్నాళ్ళకి తాతగారి పదవి కాలం కూడా ముగియ వచ్చింది. ఇదే సమయంలో తాతగారు వీలు చిక్కినప్పుడల్లా హైదరాబాద్ ఇంకా కలకత్తా నగరాలకు వెళ్లి హోమియోపతి వైద్యం గురించి తెలుసుకున్నారు.

ఆయన చాలా హోమియోపతి పుస్తకాలు తెప్పించుకుని శ్రద్ధగా చదివి త్వరలోనే హోమియోపతి వైద్య విధానం ఆకళింపు చేసుకున్నారు. మాకు ఏ నలత వచ్చినా తన వైద్యంతోనే చికిత్స చేసి తాతగారు స్వస్థత చేకూర్చేవారు.

నేను పెద్దవుతున్న కొద్దీ నాన్న గురించిన వివరాలు తెలుస్తుండేవి. నాన్నకూడా తాతగారితో బాటు హోమియో వైద్యం బాగా నేర్చుకున్నారు. నాన్న హస్తవాసి బావుంటుందని సికింద్రాబాదులో చాలా మంది జనాలు వైద్యం చేయించుకునేవారు.

ఇదే కాకుండా నాన్న పేక ముక్కలతో ఆడే బ్రిడ్జి ఆటలో బాగా నైపుణ్యం సంపాదించారు. ఈ ఆట తెలివైన వాళ్ళు ఆడే ఆటగా భావించడం వల్ల సికింద్రాబాద్ రైల్వే ఆఫీసులో నాన్న పేరు బాగా తెలిసేది. త్వరలోనే రైల్వే ఆఫీసులో ఈ ఆట ఆడే క్రొద్ది మందిలో నాన్న ప్రముఖుడయ్యారు.

బ్రిడ్జి టోర్నమెంట్లు దేశంలోని రైల్వే క్లబ్బులలో ఎక్కడ జరిగినా, నాన్నా వాళ్ళ జట్టు పాల్గొనడానికి వెళ్ళేది. వీళ్ళందరికీ ఉచిత రైల్వే పాస్ సౌకర్యం వల్ల దేశంలో ఎక్కడికైనా వెళ్ళడానికి వీలుండేది.

నాన్న మా దగ్గరకి బెల్లంపల్లి వచ్చినప్పుడల్లా ఒక విషయం గమనించాను. నాన్న ఎప్పుడూ తెగ సిగరెట్లు కాలుస్తుండే వాడు. రింగులు రింగులుగా వచ్చే సిగరెట్ పొగ, దీనితో పాటు ఆయన వ్యక్తపరిచే హావభావాలు చూసి, పదేళ్ల వయసున్న నాకు కూడా అదేంటో అనుభవించాలన్న కోరిక బలంగా మొదలయ్యింది.

నాన్న ఇలా వుంటే తాతగారు మాత్రం పూర్తి క్రమశిక్షణతో ఎటువంటి దురలవాట్లు లేకుండా ఉండేవారు. తన పిల్లలు ఇంకా మిగతా వారు కూడా అలాగే ఉండాలనే గట్టి పట్టుదలగా ఉండేవారు. వాస్తవం చెప్పాలంటే తాతగారు తన పిల్లలతో పాటు మమ్మల్ని కూడా ఒకేలా చూసేవారు. అమ్మమ్మ కూడా నన్ను లాలనగా, ముద్దుగా చూడక పోయినా తిండి దగ్గర మాత్రం తక్కువ చేసేది కాదు.

సమస్యల్లా, తిండి మాత్రమే కాదు కదా పిల్లలకి కావలసినది. నేనాశించిన ప్రేమ, అనురాగం ఇంకా నా

ప్రతిభకు తగ్గ ప్రోత్సాహం నాకెప్పుడూ లభించేది కాదు. కేశవ, చిట్టిల కన్నా నేను ఎంతో ఎక్కువ తెలివితేటలు ప్రదర్శించినా, మంచి చిత్రాలు గీసినా వీటికేమీ నాకు ఎటువంటి స్పందన, ప్రశంసలు వారి నుంచి దక్కేవి కావు. ఎప్పుడైనా చిన్నతనం వలన నేను ఏదైనా తప్పులు చేసినా వాటిని ప్రేమగా సరిదిద్దడం జరిగేది కాదు. పై పెచ్చు వీటికి బెత్తం దెబ్బలే పరిష్కారంగా భావించడం నా మానసిక స్థితినీ, భవిష్యత్ జీవితాన్ని కోలుకోలేనంతగా దెబ్బ తీసింది.

బుద్ధిగా, శ్రద్ధగా చదువుకునే కేశవ స్వభావం నన్ను ప్రభావితం చేయలేదు. కానీ ఏమీ తెలియనట్లు ప్రవర్తిస్తూ వెనుక చాటుగా చిలిపి చేష్టలు, దొంగ పనులు చేసి దొరకకుండా తప్పించుకునే చిట్టి తెలివితేటలు నేనుకూడా అదే దారి పట్టేటట్లు చేసాయి.

ఒక రోజు ఇంటికి దూరంగా మేము ఆడుకునే స్థలం దగ్గర చెట్ల మధ్య, చిట్టిని సిగరెట్ కాలుస్తుండగా చూసాను. ఇది గమనించిన చిట్టి నన్ను దగ్గరకు రమ్మని సైగ చేసాడు. "ఏం భయం లేదు. ఒక సారి పీల్చి చూడు" అని నాకు సిగరెట్ అందించాడు. సంకోచిస్తున్న నన్ను చిట్టి "ఫరవాలేదు రా! చూడు ఎంత మజా వస్తుందో" అని ఊరించాడు.

అప్పటికే సిగరెట్ రుచి ఎలాగైనా చూడాలన్న కుతూహలంతో ఉన్న నేను ఈ అవకాశం రాగానే ఆ సిగరెట్ తీసుకుని దానికి జీవితాంతం లొంగిపోయే మొదటి అడుగు వేసాను.

సిగరెట్ గట్టిగా పీల్చగానే, గొంతులో పొలమారి బాగా దగ్గొచ్చింది. చిట్టి నవ్వుతూ "అదంతే లేరా! ఫస్ట్ టైం అందరికీ అలాగే ఉంటుంది" అన్నాడు. ఆ రోజే సిగరెట్ ఎలా త్రాగాలో త్వరగా నేర్చేసుకున్న నాకు ఏదో గొప్పగా సాధించేసినట్టు భలే ఉత్సాహమొచ్చింది.

తర్వాత ఇంటికెళ్ళే సమయానికి చిట్టి తన జేబులోంచి స్ట్రాంగ్ పిప్పరమెంట్ తీసి నోట్లో వేసుకున్నాడు. ఇంట్లోవాళ్లకి తన నుంచి సిగరెట్ వాసన రాకుండా ఇలాంటి చిట్కాలు చాలానే తెలుసు చిట్టికి. ఇది మొదలు రోజూ చిట్టి బయటికెళ్లే సమయానికి నేనూ తనని అనుసరించి వెళ్లే వాడిని.

కొన్ని రోజులకే కేశవకి నా మీద అనుమానమొచ్చింది. నేను సిగరెట్ త్రాగడం గమనించి అమ్మమ్మకి చెప్పాడు. ఆవిడ నా చెవులు గట్టిగా పిండి తొడపాశం పెట్టి హెచ్చరించింది. ఇంకోసారిలా చేస్తే తాతగారికి చెప్తానని కోప్పడింది. అప్పటినుండి నేను చిట్టి ఇంట్లో వాళ్లకి తెలీకుండా బయట సిగరెట్లు ఎక్కడ దాస్తున్నాడో తెల్సుకుని, నేను కూడా గుట్టు చప్పుడు కాకుండా పని కానివ్వడం మొదలెట్టాను.

చిట్టి కూడా తెలివిగా ఇదేమి తెలియనట్లుగా ప్రవర్తిస్తూ, నాకు సిగరెట్లు బాగా అలవాటయ్యేదాకా అందుబాటులో ఉంచుతూ, ఒక రోజు పూర్తిగా కనపడకుండా చేసాడు. నేను సిగరెట్ల కోసం చిట్టిని బ్రతిమాలితే ఒక షరతు పెట్టాడు, అమ్మమ్మ పోపుల డబ్బాలో దాచే డబ్బులను మెల్లగా తేవాలని.

ఇది చేయటమే నా జీవితంలో తిరుగులేని పతనానికి మొదటి మెట్టు. నాకూ త్వరలోనే తెలిసింది దొంగ పనులు దాచడం కష్టమని. అమ్మమ్మ తాతగారికి ఈ విషయం చెప్పేసింది.

తాతగారు తన బెల్టు తీసుకుని నన్ను చావబాదారు. కానీ అమ్మమ్మ మాత్రం చిట్టి వల్లనే నేను పాడవుతున్న విషయం తెలిసి కూడా తాతగారికి ఈ విషయం చెప్పలేదు. నేను కూడా దెబ్బలు భరించానే కానీ చిట్టి గురించి చెప్పలేదు.

కొన్నాళ్ళకి తాతగారు కేశవని పై చదువులకై సికింద్రాబాద్ లోని తన మేనకోడలు ఉమాదేవి వాళ్ళింట్లో బి.కామ్ డిగ్రీ చదివించడానికి ఏర్పాటు చేసారు. ఉమ అత్తా వాళ్ళబ్బాయి వినోద్ కూడా బెల్లంపల్లికి అప్పుడప్పుడు వస్తుండే వాడు. వినోద్ నా వయస్సు వాడే. తనతో బాగా ఆడుకునే వాణ్ణి.

ఇక్కడ అత్త గురించి కొన్నిఆసక్తికర విషయాలు చెప్పాలి. ఆవిడ చిన్నతనంలో ఆరేళ్లప్పుడే మా తాత అంటే మా పితామహుడు బాబు రావు పెళ్లి చేసేసాడట. కన్యాశుల్కానికి ఆశపడి ఆమె పెళ్లి బాబు రావు తాత ఎవడికో అస్వస్థత ఉన్నవాడికిచ్చి చేసేసాడు. పాపం చాలా చిన్నపిల్ల ఆవిడ కాపురానికెళ్ళకముందే పెళ్ళైన కొన్నినెలలలోనే ఆమె భర్త కన్ను మూసాడు.

అభం శుభం తెలియని ఈ పిల్లకి గుండు గీయించి, చనిపోయిన ఆవిడ భర్త వాళ్ళింట్లో ఈ దుర్ఘటనకి పరిహారం రాబట్టే కార్యక్రమంలో మునిగిపోయాడట మహానుభావుడు మా తాత బాబు రావు. ఈ విషయం తెల్సిన సాంబశివరావు తాతగారు వెంటనే పిఠాపురం వెళ్లి, ఉమ అత్తని బలవంతంగా తనతో పాటు తీసుకొచ్చి మళ్ళీ పెళ్లి చేయించారట.

తాతమ్మ గొప్ప పెంపకంలో ఆవిడ ఆదర్శాలను అలవర్చుకున్న తాతగారు తన తమ్ముళ్ళతో పాటు దేశంలో అప్పుడు సాగుతున్న స్వాతంత్ర్య పోరాటానికి, సమాజ సంస్కరణలకు తమ వంతు చాలా కృషి చేసారు.

వీరిలా వుంటే మా తాత బాబురావు తంతు వేరేగా ఉండేది. ఈయన మాంచి విలాస పురుషుడు. సొమ్ము లేకపోయినా డాబు ప్రదర్శించి, దర్జాగా అప్పులు చేసి బ్రతికే వాడు. తన ఊరు పిఠాపురంలో ఎప్పుడూ గుర్రపు బళ్ళు (షార్టులనే వారు అక్కడ) మీదే తిరిగే వాడు. పిఠాపురం రాజా వారి చాకలి తనక్కూడా బట్టలుతుకుతాడని గొప్పలు పోయేవాడు. ఎప్పుడూ ధగ ధగా మెరిసిపోయే తెల్లటి బట్టలేసుకుని కళాపోషణ కూడా వెలగపెట్టేవాడట.

ఈయన ఘన కార్యాల లిస్టు చెప్పాలంటే ఇంకా చాలానే ఉంది. అందుకే నాకు ఆయన పేరు ఎందుకు పెట్టారని కోపంగా ఉండేది. ఎప్పటికైనా నా పేరు మార్చుకోవాలని ఉండేది. కానీ అది వీలుగాక కొత్తవాళ్లకు నా పేరు విజయ్ బాబు అని చెప్పేవాణ్ణి.

కాలం గడుస్తోంది. ఇక్కడ యధావిధిగా కాన్పుల కోసం ప్రతీ ఏడాది ఎవరో ఒకరు అమ్మా లేక పిన్ని పుట్టింటికి వస్తూనే ఉన్నారు. ఇన్ని పురుళ్ళు జరిపించే అమ్మమ్మ ఇంకా తాతగారి ఓపికకు నాకెంతో ఆశ్చర్యంగా ఉండేది. అప్పట్లో చుట్టాలందరి కుటుంబాలలో కనీసం తొమ్మిది పదేసి పిల్లలని కనడం జరిగేది.

ఇంతలో మా ఇంట్లో పెద్ద సందడి మొదలయ్యింది. తాతమ్మ ప్రోద్బలంతో సుమతికి తాతగారు పెళ్లి సంబంధాలు చూడటం మొదలు పెట్టారు. కొన్ని రోజులకే మదనపల్లెలోని ఒక సంబంధం వచ్చింది. ఆ కాలంలో ఇలా దూర ప్రాంతాల వారితో పెళ్లి సంబంధాలు కుదుర్చుకోవడం అరుదనే చెప్పాలి.

ఇక్కడ తాతమ్మ గురించి చెప్పుకోవాలి. ఆవిడ ఆ కాలపు వాళ్ళతో పోలిస్తే చాలా తెలివైనది, ముందు చూపు కల్గినది. ఆవిడ దేశంలోని చాలా ప్రాంతాలు తిరిగి చూడటం వలన ఆధునిక భావాలను అలవర్చుకున్నది. తాతమ్మ తన పెళ్ళైన తరువాత ఆవిడ భర్తతో పాటు ఆయన ఎక్కడ ఉద్యోగం చేస్తే అక్కడకి గొడవ లేకుండా వెళ్లిపోయేవారు.

అందువల్లే మా పెద్ద మేనత్త రామేశ్వరి బరంపురంలో పుట్టిందట. సరే! ఈ మదనపల్లె పెళ్లి సంబంధం వారు సుమతిని చూడటానికి వచ్చి మాకమ్మాయి నచ్చింది కానీ, మా పెద్దమ్మాయి కూడా పెళ్లీడు కొచ్చింది కాబట్టి ఆమెని మీ పెద్దబ్బాయి కేశవతో పెళ్లి చేస్తే మేమొప్పుకుంటామన్నారు.

దీనికి తాతమ్మ కూడా ఒప్పుకున్నందున సుమతి పెళ్లి, కేశవ పెళ్లి ఒకే సమయాన బెల్లంపల్లిలో ఘనంగా చేశారు. పెళ్ళిలో భలే సరదాగా అనిపించిందేమిటంటే ఆంధ్ర ప్రాంతపు గుంటూరు నుంచి వచ్చిన నా మేనత్తలు, తెలంగాణలో యాప్రాల నుంచి వచ్చిన చుట్టాలు ఇంకా రాయలసీమ ప్రాంతపు మదనపల్లె నుండి వచ్చిన పెళ్లివారు వేర్వేరు యాసలతో చాలా సందడి చేశారు. నేను కూడా పెళ్ళిలో ఎన్నో క్రొత్త మాటలు విన్నాను.

తాతగారి అక్కయ్య విజయమ్మగారు తన చిన్ననాడే పెళ్ళైన తరువాత సికింద్రాబాదుకి దగ్గర్లోని యాప్రాలలో ఉండడం వల్ల ఆవిడకి త్వరగానే ఈ ప్రాంతపు అలవాట్లు వచ్చేసాయి. ఎంతో హుందాగా పెద్ద కుంకుమ బొట్టుతో, మెడ

నిండా రక రకాల హారాలతో, చేతులకు నిండుగా బంగారు ఇంకా మట్టి గాజులు పెట్టుకుని గల గలా మాట్లాడుతున్నఆవిడని చూసి నాకు చాలా ముచ్చటేసింది.

విజయమ్మగారికి పాన్ తినటం బాగా అలవాటు. ఎప్పుడూ ఆవిడతో పాటు సిద్ధంగా ఒక పెద్ద పాన్ డబ్బాలో నిండుగా పోక చెక్కలు, ఇంకా సుగంధ వస్తువులతో పాటు తాజా తమలపాకు కట్ట ఉండాల్సిందే. దీనికి తోడు ఆవిడ పాన్ ఉమ్మడానికి ఒక గిన్నె లాంటిది కూడా ఉండేది.

నోట్లో నిండుగా ఎప్పుడూ పాన్ పెట్టుకునే ఆవిడ నన్ను పిలిచి "ఒరే పిల్లగా! నువ్వు సీతాపతి పెద్ద కొడుకు బాబు గానివి గదూ, జర మా వోడు రాజుగాడు ఏడ దొర్లాడుతున్నాడో చూసి జెప్పరా" అన్నది. ఇదే కాకుండా నన్ను "బిడ్డా! జల్దీ రాగబోతే తొడపాశం పెడ్త మల్లొచ్చినప్పుడు" అని బెదిరించింది. అంతే, మళ్ళీ కనబడితే ఆవిడ ఏం పని అప్పజెబుతుందో అని తప్పించుకు తిరిగాను.

ఇక మదనపల్లె నుండి వచ్చిన వాళ్ళ పిల్లలు వాళ్ళ నాన్నలని అప్పా, అప్పా అని పిలుస్తుంటే మాకేదో వింతగా ఉండేది. వాళ్ళని పట్టుకుని నేను "ఏడప్పా మీ అప్పా! ఏందప్పా మీ గొప్పా!" అంటూ ఆట పట్టించాను.

ఇంతలో "ఏమిరా! పొట్టి గుంకా, మీ నాయనకి చెప్పేమా ఏమీ? లేక రెండు తగిలిద్దునా" అని ఒక పెద్ద కుఱ్ఱాడు కిట్టప్ప బెదిరించేసరికి నాకు భయం పుట్టి వెంటనే మెల్లగా అక్కడ నుంచి జారుకున్నాను.

తన పెళ్లి సమయానికి కేశవకి ఇరవైయేళ్ళే ఇంకా బి.కామ్ చదువుతున్నాడు కానీ తననొక ఇంటి వాణ్ని చేయటం జరిగిపోయింది.

ఇది జరిగిన కొన్నాళ్లకే అక్కకి కూడా పదిహేను పదహారేళ్ళ వయస్సున్నపుడు, తనకి పెళ్లి చేస్తానని తాత గారితో చెప్పడానికి నాన్న బెల్లంపల్లి వచ్చారు. ఆ పెళ్లి కొడుకెవరో కాదు మా పెద్దత్త రామేశ్వరి గారి పెద్దబ్బాయి రాఘవ రావే!

రామేశ్వరి అత్తా వాళ్ళు చాలా డబ్బున్న వాళ్ళని, రామనాథం మావయ్యకి గుంటూరులో పొగాకు వ్యాపారముందని, వాళ్లకి రెండు కార్లు కూడా ఉన్నాయని అప్పట్లో గొప్పగా చెప్పుకునే వారు. ఇదే కాకుండా రామనాథం మావయ్య షిరిడి సాయిబాబా భక్తులని, బాబా పేరు చెబితే చాలు ఎంతో డబ్బు విరాళాల రూపంలో ఎడా పెడా దానం చేసేవారని విన్నాము.

తాతగారికి కూడా తిరిగి తన మేనకోడలు రామేశ్వరి కొడుకుకే సుగుణక్క సంబంధం కలపడం బాగా నచ్చింది. ఐతే! అక్క తను చదువుకుంటానని ఎంత ప్రాధేయపడ్డా తొమ్మిదో తరగతి చదువుతుండగానే బడి మాన్పించేసి పెళ్లి చేయటానికి సిద్ధ పడ్డారు.

ఒక విషయం నాకూ అక్కకే అర్ధం కాలేదు. ఇన్నేళ్ళుగా మమ్మల్ని పట్టించుకోని మా గుంటూరు మేనత్తకి మా మీద ఇంత దయ హఠాత్తుగా ఎలా వచ్చిందోనని. నాన్న హైదరాబాద్ వెళ్లి పోగానే ఇంట్లో వాళ్ళ మాటల వల్ల తెలిసింది రామేశ్వరి అత్తా వాళ్ళ స్థితిగతులు ఇప్పుడు ఊహించలేనంతగా మారిపోయాయని, అందుకే వాళ్ళు సుగుణక్కని సంబంధం కలుపుకోవడానికి ఇష్ట పడుతున్నారని.

కొన్నాళ్ల క్రితం రామనాధం మావయ్య జపాన్ కు అతి పెద్ద పొగాకు సరుకును రవాణా చేస్తున్న ఓడ మునిగిపోవడం వలన, ఆయనకు కోలుకోలేనంత తీవ్ర నష్టం కలిగిందని తెలిసింది. అప్పట్లో ఇటువంటి అనుకోని విపత్కర ఘటనలకు బీమా సదుపాయం ఉండేది కాదు. ఉన్నా మన దేశంలో చాలా మందికి ఇది తెలిసేది కాదు.

రామనాధం మావయ్య భారీ సొమ్మును తర్వాత అక్కరకు వస్తుందనుకుని భూములు కొనుగోలు చేసి పెట్టమని చుట్టాలని, స్నేహితులని గుడ్డిగా నమ్మి వాళ్ళకిచ్చారు. వాళ్లేమో అలా కొన్న భూములను వాళ్ళ భార్యల పేర్ల మీద రిజిస్టర్ చేసుకున్నారని ఆయనికిప్పుడు ఎంతో అవసరమైనప్పుడు తెలిసింది.

పాపం! ఈ ఆపత్సమయంలో వారు చేసిన నమ్మక ద్రోహానికి ఆయన పూర్తిగా కృంగిపోయారు. తిరిగి పెట్టుబడి పెట్టడానికి సహ వ్యాపారులు సహకరించక పోగా ఇంతకు ముందు పెట్టుబడుల కోసం చేసిన అప్పులన్నీ వెంటనే తీర్చమని వత్తిళ్లు పెరిగాయి.

రామనాధం మావయ్య ఇటువంటి సమయంలో తన మంచితనం, పరువే ముఖ్యమనుకుని, ఉంటున్న పెద్ద ఇల్లు దానితో పాటు ఇంట్లో నగలన్నీ అమ్మి, అందరి అప్పులు తీర్చేసాక ఇప్పుడేమీ లేకుండా పెద్ద సంతానంతో మాత్రం మిగిలారు. ఆయనకు కుటుంబ పోషణ భారమైన ఈ పరిస్థితిలో అందరి కంటే పెద్దవాడైన రాఘవ బావ స్కూల్ ఫైనల్ తోనే తన చదువు ఆపేసి ఉద్యోగం వేటలో ఉన్నాడు. అందుకే రాఘవ బావని సికింద్రాబాదుకి రప్పించి రైల్వేలో ఉద్యోగం ఇప్పించారు నాన్న.

మధ్య తరగతి చరిత్ర పునరావృత్తమవుతోంది!

తన మేనమామ ఎలాగైతే తనకి ఉద్యోగమిప్పించి పిల్లనిచ్చి పెళ్లి చేసాడో అలాగే నాన్న కూడా రాఘవ బావకి

సుగుణక్కనిచ్చి పెళ్లి చేద్దామనుకున్నాడు!

తలచుకుంటే ఎంతో విచిత్రంగా ఉంటుంది. వీళ్ళందరూ మంచి వాళ్ళే. కానీ సమస్యల నుంచి తప్పించుకోవడానికి వీళ్ళు ఏదో ఒక తక్షణ పరిష్కారం అమలు పరిస్తే, దాని జీవిత కాల పర్యవసానం వీళ్ళ పిల్లలు తప్పక అనుభవించే వారన్నమాట!

పెళ్లప్పుడే చూసాను నాజూగ్గా, సన్నగా ఉన్న రాఘవ బావని. అప్పట్నుంచీ తనని నేను బావా అని చనువుగా పిలవడం మొదలైంది.

*విజయ్ బాబు స్వగతం*

*మలి మజిలీ – సికంద్రాబాదు*

అక్క పెళ్ళైన కొన్నాళ్ళకి తాతగారి పదవీ విరమణ కాలం సమీపించింది. ఆయన ఇక స్వంత ఇల్లు కట్టుకోదలిచి సికంద్రాబాదులోని సీతాఫలమండికి దగ్గరలోనే అప్పటి నిజాం నవాబు సంబంధీకుల నుంచి చాలా పెద్ద స్థలం కొన్నారు.

ఇక వెంటనే తన క్రొత్త ఇంటి నిర్మాణపు పనులు కూడా మొదలెట్టించారు. క్రొత్త స్థలంలోనే ఒక సున్నపు బట్టీ ఏర్పాటుతో పాటు, ఎడ్ల సాయంతో సున్నం తయారీ చేయించి, బెల్లంపల్లి అడవుల నుంచి మంచి కలప కొని త్వరలోనే రెండంతస్తుల భవంతి కట్టించేసారు.

క్రొత్త ఇల్లు పూర్తయ్యే సమయానికి తాతగారి పదవీ కాలం కూడా ముగిసి అందరూ నూతన గృహ ప్రవేశం చేశారు. ఈ శుభకార్యం జరిగిన తరువాత తాతగారు చిట్టికి కూడా రైల్వేలో స్టోర్స్ శాఖలో ఉద్యోగం వేయించి త్వరలోనే చిట్టికి సుమతి అత్తారింటి వైపు చుట్టాలమ్మాయినిచ్చి వివాహం జరిపించారు.

అలుపెరగని తాతగారు ఇప్పుడు తన పిల్లలందరికి ఇళ్ళు కట్టించివ్వాలన్న పెద్ద పనికి పూనుకున్నారు. అమ్మకి, రమ పిన్నికీ, చిట్టికి ఇంకా సుమతికి తానే దగ్గరుండి వేర్వేరు ఇళ్ళు కట్టించి పంపకం చేసేసారు. ఇవన్నీ పూర్తవ్వగా మిగిలిన కొంత జాగా అప్పటికలాగే ఉంచారు. తాతగారు జాగ్రత్తగా పొదుపు చేసిన తన సంపాదనని తన పిల్లలందరికీ ఎంతో చక్కగా ఉపయోగించారు.

అమ్మకి తాతగారు కట్టించిన క్రొత్త ఇంటికి నేను కూడా మారాను. ఇక్కడ పెద్ద చెల్లెలు సుభద్ర, పెద్ద తమ్ముడు కృష్ణుడుతో పాటు నా సహవాసం మొదలైంది. నన్ను సికంద్రాబాదులోని మెహబూబ్ కాలేజీ వాళ్ళు నడిపే స్కూల్ లో చేర్పించారు.

క్రొత్త ఇంటి దగ్గర వాతావరణం నాకు నచ్చింది. చాలా మంది పిల్లలతో ఆడుకోవడానికి హాయిగా ఉంది. కాబోతే ఇంటినుంచి స్కూల్ కి మూడు మైళ్ళ దూరం నడవాలి.

ఇన్నాళ్లు బెల్లంపల్లిలో తాతగారు నా స్కూల్ అవసరాలన్నీ అడగకుండానే ఏర్పాటు చేసేవారు. కానీ ఇప్పుడు ఏది కావాలన్నా నాన్నని అడగాలంటే నాకు జంకుగా ఇబ్బందిగా ఉండేది.

స్కూల్ కి వెళ్లే దారిలో చాలా సినిమా హాళ్లు ఉండేవి. బెల్లంపల్లిలో ఇవేమీ తెలియని నాకు ఇదో చక్కటి క్రొత్త ప్రపంచంలా కనిపించేది. సికింద్రాబాద్ వీధుల్లో కనబడే పెద్ద సినిమా పోస్టర్లని చూడటం నాకు ఎంతో ఆసక్తిగా ఉండేది. ఇక్కడ నవంబర్ నెల వచ్చే సరికే పతంగులను ఎగుర వెయ్యడం మొదలయ్యేది. మెల్లగా, తెలియకుండానే నాకు చాలా స్వేచ్ఛ మొదలయ్యింది.

అమ్మ నన్ను పెద్దగా పట్టించుకునేది కాదు. ఏదో భోజనం సమయానికి పిలవటం అంతే! నాన్నకి కూడా నన్ను పట్టించుకునే సమయం ఉండేది కాదు. ఆదివారమొస్తే కొంచెం తీరిక చిక్కేది ఆయనకు. ఆ సమయం కూడా క్రొత్త ఇంట్లో పూలు, పండ్ల చెట్లు నాటటం, వాటి సంరక్షణ ఇంకా పిల్లలతో ఆడడమే ఆయనకి సరిపోయేది.

క్రొత్త స్కూల్ లో మొదట్లో కొంచెం కష్టం వేసినా త్వరలోనే నేను కూడా బాగానే చదవటం మొదలుపెట్టాను. ఇంగ్లీష్ భాష మీద ఇష్టంతో బాగా నేర్చుకోవాలని ప్రయత్నించేవాడిని. పదవ తరగతిలో నాకు మార్కులు బాగానే వచ్చాయి.

ఉమత్త వాళ్ళబ్బాయి వినోద్ కూడా నాతో పాటు పి.యు.సిలో సైన్స్ గ్రూప్ తీసుకున్నాడు. ఇద్దరం బాగానే చదువుతుండే వాళ్ళం. వినోద్ క్రికెట్ ఆట అంటే బాగా ఇష్ట పడేవాడు. క్లాసులవ్వగానే సాయంత్రం మైదానంలో ఆటలాడడానికి వెళ్లి పోయేవాడు. నాకు మాత్రం ఆకలి కడుపుతో ఏ ఆటలాడడానికి అంత ఆసక్తి ఇంకా శక్తీ ఉండేది గాదు. దీనితో మెల్లిగా కాళ్ళీడ్చుకుంటూ ఇంటి దారి పట్టేవాడిని.

మెల్లగా ఇంట్లో వాతావరణం ఇంకా ఆర్థిక ఇబ్బందుల వల్ల నాకు చిరాకు మొదలైంది. నాకు మాత్రం ఏదో త్వరగా సాధించేసి జీవితాన్ని హాయిగా అనుభవించేయాలని ఉండేది.

నా పి.యు.సి చదువు ముగియబోతుండగా నాన్నావాళ్ళు నేను ఇక త్వరగా ఉద్యోగం చూసుకొని ఇంట్లో సహాయంగా ఉండాలని కోరుకుంటున్నట్లు నాకర్ధమైంది. నాన్నకి కూడా ఆర్ధిక పరిస్థితి కష్టంగా మారడంతో ఆయన ఆలోచనా విధానం కూడా అలాగే ఉండేది. బాగా చదివి మెడికల్ కాలేజీలో సీటు సంపాదించి డాక్టర్ అవ్వాలన్న నా కోరిక తీరబోదని నాకు బలంగా సంకేతాలు వస్తున్నాయి.

మెడిసిన్ చదవటానికి ఆర్ధిక పరిస్థితి సహకరించక పోతే కనీసం డిగ్రీ కాలేజీలో చేరి పై చదువులు చదివి లెక్చరర్ ఐనా అవ్వాలని ఉందని కూడా నాన్నతో చెప్పలేకపోయాను. దీనితో పి.యు.సి చివరి పరీక్షల సమయానికి నా ఉత్సాహం పూర్తిగా సన్నగిల్లింది. కాలేజీ ప్రక్కనే సినిమా హాళ్లు ఉండటంతో నా మనోవేదన మరల్చుకోటానికి సినిమాలు చూడడం నాకొక వ్యాపకంగా మారింది.

ఇటు చూస్తే నాన్న తన ధ్యాస బ్రిడ్జి ఆట నుంచి పేకలో మూడు ముక్కలాటకి మార్చాడు. ఈ పేకాట బాగా ఆడి డబ్బులు త్వరగా సంపాదించాలని ఆశపడ్డ నాన్న దానికి పూర్తిగా వశమయ్యాడు. దీనితో పాటు త్రాగడం కూడా తోడై ఎంతో తెలివితేటలున్న నాన్న కూడా దారి తప్పి అప్పుల పాలయ్యాడు.

అప్పుల వాళ్ళు వస్తే మామూలుగా రారుగా! నాకు బాగా గుర్తుంది. అప్పుడప్పుడూ ప్రొద్దునే ఒక కాబూలీ వాడు పెద్ద మోటర్ సైకిల్ పై వచ్చి "రావు సాబ్!" అని బిగ్గరగా పిలిచే వాడు.

తాతగారికి కూడా నాన్న గురించి బాగా దిగులు పట్టుకుంది. తన మేనల్లుడు చేసే అప్పులు ఇంకా మందు కొట్టడం ఆయనకు తెలిసిపోయింది. తాతగారు అమ్మ దగ్గరకొచ్చి నాన్న గురించి ఎప్పుడడిగినా ఆఫీస్ పని వల్ల లేటుగా వచ్చారని, పడుకున్నారని ఇంకా లేవలేదని చెప్పేది. దీనితో కమలమ్మ కూడా తనని మోసం చేస్తోందని చెప్పి తాతగారు బాధ పడేవారు.

అమ్మ మాత్రం ఏం చేస్తుంది. తనకు కూడా పొదుపు చేయటం అలవాటు లేదు. ఇంకా నాన్న ఇచ్చే డబ్బుతో జాగ్రత్తగా కుటుంబం నెట్టుకు రావడమూ కష్టమే. రమ పిన్ని వాళ్ళింట్లో కూడా ఇదే తంతు. ఉద్యోగం మానేసిన భర్తతో, పది మంది పిల్లలతో ఆవిడా సతమతమౌతుండేది. వీళ్ళందరికీ తాతగారు వీలైనంత తన పెన్షన్ డబ్బులతో ఏదో ఒక సహాయం చేసేవారు.

అదేమిటో ఆ తరం వాళ్లెవరిని చూసినా గంపెడు సంతానం కని ఒక్క మనిషి సంపాదనతో నెట్టుకు రావాలని ప్రయత్నించే వారు.

తాతగారు ఎంతో క్రమశిక్షణగా తన ఆరోగ్యం కాపాడుకుంటూ అలాగే తన కుటుంబమంతటికీ ఏ మాత్రం నలత వచ్చినా హోమియో వైద్యం చేస్తూ ఒక పెద్ద దిక్కులా నిలబడేవారు. అప్పటికే ఆ కాలంలో కుటుంబనియంత్రణ గురించిన అవగాహన పెంచుకుని తాతగారు తన అల్లుళ్ళకి ఎంత చెప్పినా వాళ్ళు వినకుండా గంపెడు సంతానాన్ని కన్నారు. ఈ విషయంలో ఆయన కొడుకులు కేశవ ఇంకా చిట్టి చిన్నసంతానంతోనే సరిపెట్టి నయమనిపించారు.

నేను పి.యు.సి చదువుతుండగానే నాన్న పెద్ద చెల్లి సుభద్రకి పెళ్లి చేయాలని నిశ్చయించారు. సుభద్రకి చదువు మీద శ్రద్ధ లేకపోగా కొన్ని ఆరోగ్య ఇబ్బందులు కూడా ఎప్పుడూ ఉండటం వలన దూరపు చుట్టాలకి తెలిసిన జోగారావు అనే కుర్రవాడి సంబంధం చూసారు.

జోగారావు మెట్రిక్ కూడా పాస్ అవ్వలేదు. తన ఆర్థిక స్థితి కూడా అంతంత మాత్రమే. కానీ సుభద్ర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అతనికిచ్చి పెళ్లి చేశారు. జోగారావుకు తగినంత చదువు లేకపోవడం వలన నాన్న త్వరలోనే అతనికి రైల్వేలోనే కళాసీ ఉద్యోగం వేయించారు.

ఈ సమయంలో చెల్లి పెళ్లి ఖర్చులతో సతమతమౌతున్న వేళ నాన్నని నేను డిగ్రీ చదువుతానని ఇంకో మూడేళ్లు ఇది భరించమని అడగలేకపోయాను. ఒక వేళ అడిగినా నాన్నకి అది సాధ్యమయ్యేది కాదు.

నాన్నకి మా తర్వాత పుట్టిన ముగ్గురు ఆడ పిల్లలూ, ఇద్దరు మగ పిల్లల అవసరాలను తీర్చటమే గగనమౌతోంది. ఇది చాలదన్నట్లు అమ్మ మళ్ళీ గర్భవతి అయ్యింది. త్వరలోనే నాకు ఇంకో తమ్ముడు పుట్టాడు.

ఏమి చెయ్యను? ఏమీ చెయ్యలేని పరిస్థితిలో నాన్నతో సరే! నేను కూడా ఉద్యోగంలో చేరతానన్నాను. నాన్న రైల్వేలో నా గురించి క్లర్క్ ఉద్యోగం కోసం ప్రయత్నం చేశారు కానీ ఉద్యోగాలు ఖాళీ లేవన్నారు. నా మీద అప్పటికే మంచి అభిప్రాయం పోయిన తాతగారు కూడా నా ఉద్యోగం గురించి ఏమీ సాయం చెయ్యకున్నారు.

ఏదో ఒక ఉద్యోగం మొదలుపెట్టి తరువాత అవకాశం వచ్చినప్పుడు మంచి ఉద్యోగం సంపాదించవచ్చని నాన్న నన్ను బలవంత పెట్టి, రైల్వేలోనే ఒక చిన్న ఉద్యోగం ఇంచుమించు కళాసీ స్థాయి వంటిదే ఇప్పించారు.

ఇది కూడా నా జీవితాన్ని మలుపు తిప్పిన దురదృష్టకర సంఘటన.

నేను చాలా బాధ పడ్డాను. లోలోన ఎంతో కుమిలిపోయాను. నా ఆవేదనని ఎవరితో పంచుకోవాలో తెలీదు. అందరికీ అప్పటి మా కుటుంబ ఆర్థిక పరిస్థితి మాత్రమే కనపడింది. దాని గురించే ఆలోచించారు. నేను కూడా నాలుగు రూకలు సంపాదిస్తే నాన్నకి ఆసరాగా ఉంటానని భావించారు.

ఎంతో అయిష్టంగా నేను ఆ చిన్న రైల్వే ఉద్యోగంలో చేరాను. నా తెలివితేటలకి ఈ ఉద్యోగం చేయటం నాకు ఏమాత్రం సంతోషం కలిగించలేదు. చాలా మంది నా తోటి ఉద్యోగస్తులంతా పెద్దగా చదువుకున్నవారు కాదు. పని వేళలు పూర్తవ్వగానే పేకాట, మందు కొట్టడమే వాళ్ళ ముఖ్య దినచర్య.

ఈ ఉద్యోగమంటే అసలే కోపంతో బాధగా ఉన్న నేను పనవ్వగానే ఇంటికెళ్ళటం ఇష్టం లేక నా విచక్షణ కోల్పోయి వారి సాంగత్యానికి లోనయ్యాను. సిగరెట్లు త్రాగుతూ సినిమాలు చూసి రాత్రి ఆలస్యంగా ఇంటికి రావటం చేస్తూ దాదాపు ఏడాది గడిపేశాను.

నా వ్యవహారం గమనిస్తున్ననా గొప్ప బంధుగణం నా గురించి మరో సాయానికి పూనుకున్నారు. నాకు పెళ్లి చేస్తే బాధ్యత తెలిసి కుదురుకుంటానని. ఈ పాటికే నా జీవిత గమ్యం గురించిన ప్రణాళికలు మానేసిన నేను ఇంట్లో వాళ్ళు నాకు పెళ్లి సంబంధం చూస్తామంటే వద్దని చెప్పలేదు.

కొన్నాళ్ళకి జోగారావు తరపున ఒక పెళ్లి సంబంధం వచ్చింది. తనకి దూరపు చుట్టమొకాయన జగ్గయ్యపేట దగ్గర చిన్న ఊర్లో ఉపాధ్యాయుడు. ఆయన రెండో కూతురు కనకదుర్గ ఐదవ తరగతి చదువాపి ఇంట్లోనే ఉంటోంది. ఆ కుటుంబం మంచిదని జోగారావు నాన్నకి చెప్పి ఈ సంబంధం ఖాయం చేసుకొమ్మని ఒత్తిడి చేసాడు.

దీని గురించి నాన్న నాతో ప్రస్తావించినప్పుడు కోపంలో ఉన్న నేను "ఏదో ఒకటి చేసుకోండి. నేనేమీ దీని గురించి ఆలోచించను" అని నాన్నకి మొండిగా చెప్పటంతో కనకదుర్గతో నా పెళ్లి జరిగిపోయింది.

కనకదుర్గ అమాయకపు మాలోకం. చదువు లేకపోతే సరి, లోకజ్ఞానం కూడా లేదు. ఆఖరికి వంట కూడా చేయటం రాదు. పెళ్ళైన అతి త్వరలోనే నాకర్ధమైపోయింది, నేను ఎంతటి ఊబిలో కూరుకుపోయానో అని.

భగవంతుడా! నేనెంతటి తప్పు చేసాను. చక్కటి భవిష్యత్తుకు ఏర్పాట్లు చేసుకోవలసిన నేను ఆవేశంలో ఒక మూర్ఖ జీవిలా ప్రవర్తించాను. ఇక తిరిగి సరిదిద్దుకోలేని పరిస్థితికి నన్ను నేను చేర్చుకున్నాను.

కొన్ని రోజులకే ఇంట్లో వాళ్ళకి కూడా అర్ధమయ్యింది క్రొత్త కోడలు పిల్ల పెద్ద భారమని. లౌక్యం తెలియని, పనికిరాని ఈ అయోమయపు పిల్లని వాళ్ళు భరించదలచలేదు. అందుకని మాకు వేరే కాపురం కొంచెం దూరంగా ఏర్పాటు చేసి మమ్మల్ని బయటకు తోశారు.

**ఇదిలా వుంటే రైల్వే వర్క్ షాపులో** ఉద్యోగం కూడా నాకు పెద్ద భారమయ్యింది. ఏమిటీ బండ పని? ఎదుగుదలకి ఆస్కారం లేని ఉద్యోగం అని నిత్యం బాధపడ్డాను. ఓ రోజు ఈ ఉద్యోగం ఇక చేయనని గట్టిగా అనుకుని పనికి వెళ్ళటం మానేసాను.

కొన్ని రోజుల తరువాత నాన్నకి ఈ విషయం తెలిసి నా దగ్గరకొచ్చి అడిగితే చెప్పాను, నేనిక ఈ పని చేయలేనని. నాన్న "ఓపిక పట్టు బాబూ! త్వరలోనే మళ్ళీ పెద్ద ఉద్యోగాలకి నోటిఫికేషన్ వస్తుంది. అప్పుడు డబ్బులు ఖర్చు పెట్టైనా నీకు ఉద్యోగం ఇప్పిస్తాను" అన్నాడు.

కానీ అప్పటికే రెండు నెలలైంది నేను పనికి వెళ్ళక. ఆఫీస్ నుంచి సస్పెన్షన్ ఆర్డర్ కూడా వచ్చింది. నా మొండి ప్రవర్తనకి నాన్నకూడా చేతులెత్తేశాడు. "నీ ఖర్మ! నేనిక ఏ సాయం చేయలేను" అని నిష్కర్షగా చెప్పేసి, నానా తిట్లు తిట్టి నాన్న వెళ్ళిపోయాడు.

ఇది చాలదన్నట్లు త్వరలోనే దుర్గ గర్భం దాల్చింది. తనని వాళ్ళ పుట్టింట్లో దిగబెట్టి వీధులంబడి పడ్డాను. నే వెళ్లి అడిగినప్పుడల్లా అక్కా బావ సాయం చేసే వారు తిండి గడవడానికి. కొన్నాళ్ళకి ఒక సేల్స్ రిప్రెజెంటేటివ్ ఉద్యోగం సంపాదించాను. ఈ ఉద్యోగం కూడా నాకిష్టం లేకపోయినా జీవనోపాధికి చేయక తప్పలేదు.

ఈ మధ్య కాలంలో చుట్టాలెవరితోను పెద్దగా రాకపోకలు లేవు. తాతగారిని కలిసి ఏదైనా సహాయం కోరాలని

వెళ్లినా ఆయన నన్ను కలవటానికి ఇష్ట పడట్లేదు. నేను రైల్వేలో ఉద్యోగం మానేసినట్లు ఆయనకి కూడా తెలిసింది. నేను ఏదైనా చిన్న ఉద్యోగమైనా సరే చేసుకుంటూ, కష్టపడి ప్రైవేటుగా డిగ్రీ చదివి మంచి ఉద్యోగం తెచ్చుకోవాలని

ఆయన అభిప్రాయం. నా దురలవాట్లు ఇంకా చిట్టితో సావాసం వల్ల ఆయనకి నేనంటే ఏమాత్రం ఇష్టం లేదు.

నా దురదృష్టమేమిటంటే దారి తప్పిన నన్ను తాతగారు మళ్ళీ బుజ్జగించి సక్రమ మార్గాన మళ్ళించకపోగా, నేనిక అస్సలు బాగుపడనని భావించారు. దీని పర్యవసానమేమిటంటే ఆయన తన పిల్లలందరికీ స్థలాలిచ్చి, ఇళ్ళు కట్టించాక మిగిలిన జాగాని అక్కకి, చెల్లెలు సుభద్రకి, ఇంకా రమ పిన్ని పెద్దమ్మాయికి వేర్వేరుగా మూడు భాగాలు చేసి వారి పేరున రిజిస్టర్ చేయించేశారు.

నేను కూడా తాతగారి పిల్లలందరితో బాటు ఆయన పెంపకంలోనే పెరిగాను. ఐనా నాకు మాత్రం మొండి చేయి చూపించారు. ఆయన చిన్నకొడుకు చిట్టి నా కంటే ఎన్నో తప్పులు చేసినా ఆస్తి సమంగానే పంచారు కదా. మరి నాకెందుకీ అన్యాయం? పసికందుగా ఉన్న నన్ను తీసుకొచ్చి పెంచారు కదా మరి నన్నొక్కడినే ఎందుకు శిక్షిస్తున్నారని చాలా బాధ పడ్డాను.

ఇది చాలక నా దురదృష్టం గురించి చిన్నదైనా ఇంకో సంఘటన చెప్పాలి.

నాకు జన్మనిచ్చి చనిపోయిన మా అమ్మా వాళ్ళ అన్నయ్య అంటే మా మేనమామ వాళ్ళ ఊరు తుని నుంచి మా కోసం వెతుక్కుంటూ సికింద్రాబాద్ వచ్చాడని తెలిసింది. మా అమ్మ పుట్టింటి వాళ్ళ ఆస్థి అమ్మకాలు సంబంధించి, చనిపోయిన మా అమ్మకు కూడా వాటా ఉండటం వల్ల ఆవిడ సంతానం నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్

కోసం వస్తే, నాన్న ఆయనతో మాట్లాడి అక్కతో సంతకం పెట్టించి పంపేసినట్లు తెలిసింది.

అక్కడేమి జరిగిందో నాకు మాత్రం తెలియలేదు. నాకు కనీసం జన్మనిచ్చిన అమ్మ వైపు బంధువుల సాయం కూడా లభించే అవకాశం పోయింది.

ఇంకో వైపు నాన్నతన క్షీణిస్తున్నఆరోగ్యం దృష్ట్యా తను పని చేసే రైల్వే ఆఫీసుకు అతి దగ్గరలోనే ఉన్న రైల్వే క్వార్టర్స్ లోకి ఇల్లు మారారు. ఈ రైల్వే క్వార్టర్ చిన్నదైనా చుట్టూ చెట్లతో ఆహ్లాదంగా ఉందక్కడ. ఆఫీసు దగ్గర కావటంతో నాన్న రోజూ నడిచే వెళ్లి వస్తుండే వాడు. ఇది బాగానే ఉంది కానీ నాన్న పేకాట మాత్రం మానలేదు.

సరే, కుటుంబమంతా ఇక్కడ కుదురుకుంటున్నారన్న సమయంలోనే ఒక రోజు నాకు పిడుగు లాంటి వార్త వచ్చింది. నాన్నకి హఠాత్తుగా గుండెపోటు వచ్చి వెంటనే ఇంట్లోనే మరణించారని!

పరుగున రైల్వే క్వార్టర్స్ కి వెళ్ళాను. అమ్మా, పిల్లలంతా గట్టిగా ఏడుస్తున్నారు. శవమైన నాన్నని చూసే సరికి నాకు కూడా కళ్ళు తిరిగి, గుండె పిండేసినట్లై నేల మీద కూలబడిపోయాను.

"అయ్యో అన్నయ్య! నాన్నను చూడన్నయ్యా!! నువ్వైనా నాన్నను లేపన్నయ్యా" అంటూ చిన్న చెల్లెళ్ళు నన్ను పట్టుకుని హృదయ విదారకంగా ఏడుస్తూ కుదిపేసారు. మా అందరికీ ఇది ఎప్పటికీ తట్టుకోలేని దుర్ఘటన.

చిన్నప్పటి నుండీ నేనూ అక్కా, అమ్మా నాన్నలకి దూరమై బ్రతికాము. సికింద్రాబాద్ వచ్చాకే కొన్నాళ్ళు నేను నాన్నతో కలిసి ఉండగలిగాను. ఇక పెళ్ళైన తరువాత నన్ను వేరే కాపురం పెట్టించినా కనీసం నాన్నఎప్పుడైనా కనపడేవాడు. నాకంటూ ఒక పెద్ద దిక్కు పేరుకైనా ఉన్నాడనుకుంటే ఇప్పుడు నాన్న కూడా లేడు. నాకిప్పుడు ఎవరున్నారని అక్కని పట్టుకు ఏడ్చాను.

ఈ వార్త తెలిసి తాతగారితో సహా దగ్గర బంధువులందరూ వచ్చేసారు. అప్పటికప్పుడు నాన్న పార్థివ దేహాన్ని స్వంత ఇంటికి తీసుకెళ్ళే పరిస్థితి లేనందున రైల్వే క్వార్టర్స్ లోనే ఉంచి తదుపరి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. నాన్న శ్రాద్ధ కార్యక్రమాలన్నీ పూర్తయ్యాక కొన్నిరోజులకే అందరూ తిరిగి స్వంత ఇంటికి వచ్చేసారు.

నాన్నకు ఇంకా నాలుగైదేళ్లు రైల్వేలో సర్వీస్ ఉండగానే పోయారు. పెద్ద చెల్లెలు సుభద్రకు మాత్రమే పెళ్లి అయ్యింది. పెద్ద తమ్ముడు క్రిష్ణుడు డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు. మిగతా పిల్లలందరూ స్కూల్ కెళ్తున్న చిన్న వాళ్ళే.

పేరుకు పెద్ద కొడుకునే కానీ నేను ఏ మాత్రం ఆర్థికంగా స్థిరపడని వాడిని ఇంకా ఈ కుటుంబానికి ఎప్పుడూ

దగ్గరగా లేను. నా బలహీన పరిస్థితి వలన కూడా నన్నెవరూ ఈ కుటుంబ బాధ్యత తీసుకొమ్మని అడగటానికి సుముఖంగా లేరు.

నాన్న సర్వీస్ లో ఉండగానే చనిపోవడం వలన కుటుంబంలో ఒకరికి రైల్వే ఉద్యోగం వచ్చే అవకాశముంది. తాతగారు దాని గురించి ఆలోచన మొదలు పెట్టారు. ఈ సమయంలో పెద్ద కొడుకుగా నాకు రైల్వేలో క్లర్క్ ఉద్యోగం

వచ్చే అవకాశముంది కాబట్టి నేను ఇది అందుకుని అమ్మా వాళ్లకు ఆలంబన అవుదామనుకున్నాను గానీ, నా దురదృష్టం ఎప్పుడూ నన్ను వదిలి వెళ్ళదు కదా!

తాతగారికి నేనంటే ఇష్టం లేదు మరేమో అమ్మకి నా మీద నమ్మకం లేదు. అందుకే తాతగారు రైల్వే ఆఫీసుకి అభ్యర్ధన పంపారు పెద్ద కొడుకైన నేను కుటుంబ బాధ్యత వహించకుండా వేరుగా ఉండడంతో, ఈ ఉద్యోగం

రెండవ కుమారుడు క్రిష్ణుడుకి ఇవ్వడం వలన ఆ కుటుంబానికి సరి ఐన ఆసరా అవుతుందని. తాతగారికి తెలిసిన వాళ్ళ ప్రయత్నాలు కూడా తోడై రైల్వే ఆఫీసులో క్రిష్ణుడుకి ఉద్యోగం ఇచ్చారు.

పోనీ లే! నా దురదృష్టాన్ని ఎవరూ తొలగించలేరు. కనీసం అమ్మ కుటుంబం దీని వలన తిరిగి నిలదొక్కు కుంటుందని మనసు కుదుటపరచుకున్నాను. నాన్న పోయిన కొన్ని రోజులకే నేనూ నా కుటుంబం మా అద్దె ఇంటికి తిరిగి వెళ్లిపోయాము. నేను అప్పుడప్పుడూ అమ్మా వాళ్ళని కలిసి వస్తుండే వాడిని.

విజయ్ బాబు పతన దశ

ఇంకా స్థిరమైన ఉద్యోగం ఏమీ దొరకక అగచాట్లు పడుతున్న ఇటువంటి సమయంలో ఒక రోజు చిట్టి నాకు కబురంపాడు తనని వచ్చి కలవమని. ఏమిటి సంగతని వెళితే బయటకు ఒక ఇరానీ హోటల్ కి తీసుకెళ్లాడు. నాకు చాయ్, తనకి పౌనా చాయ్ ఇంకా ఖారా బిస్కెట్లు బార్ వాలాకి పురమాయించి, నాకొక సిగరెట్ ప్యాకెట్ అందించి నవ్వుతూ అడిగాడు

"ఏంటి బాబూ! ఏం చేస్తున్నావు. అంతా బావుందా" అని.

నాకు చిట్టి వ్యంగ్యంతో కాలింది "ఏం ఎగతాళిగా ఉందా మామా నీకు కూడా" అన్నాను.

"లేదురా! నాకు తెలుసు నీ బాధలు. ఏదో ఒకటి చేయాలి కదా అందుకే నిన్ను పిలిపించా. నాకు కొన్ని ఐడియాలు ఉన్నాయి. ఎన్నాళ్లని ఈ చిన్నా చితకా పనులు చేస్తావు? ఏదైనా జాక్ పాట్ కొట్టాలి నీ బాధలన్నీ తీరాలంటే" అన్నాడు చిట్టి.

నిండా బాధల్లో మునిగిన నాకు చిట్టి మాటలు క్రొత్త ఆశని కలిగించాయి.

"అయితే చెప్పు నేనేమి చేయాలి" అన్నాను.

"ఇప్పుడు కాదులే త్వరలోనే చెబుతాను. కానీ నువ్వీ విషయాన్ని ఎవరితోటీ ముచ్చటించకు. నేనిప్పుడు ఒక ముఖ్యమైన పని మీద బయటికెళ్ళాలి" అని నన్ను సస్పెన్సులో ఉంచి చిట్టి వెళ్ళిపోయాడు.

నాకు మాత్రం ఇది విన్నతరువాత చిట్టి నాకు ఏమి దారి చూపిస్తాడో అని చాలా ఆసక్తిగా ఉంది. ఏదో ఒక తేలిక మార్గంలో త్వరగా డబ్బు సంపాదించే విషయమేమిటా అని నాకు నిద్దర పట్టలేదు.

రెండు రోజులు కూడా గడవకుండానే నా అంతట నేను తిరిగి చిట్టి దగ్గర వాలి పోయి "చెప్పు మామా! నాకు ఎదో ఒక దారి చూపిస్తానని ఊరించావు. అదేంటో చెప్పు" అని తరచి తరచి అడిగాను.

"నిజమేరా! కానీ నా ఆలోచన పని చెయ్యాలంటే ఏ మాత్రం సంకోచించకుండా నాకు సహకరించే వాళ్ళు కావాలి. బయటి వాళ్ళు అంటే నాకు నమ్మకం లేదు. పైగా ఇది చాలా జాగ్రత్తగా చెయ్యాల్సిన పని. అందుకే నీకు చెప్పాలనుకున్నా. కానీ నువ్వు ఒప్పుకుంటావో లేదో అని సంకోచిస్తున్నా" అన్నాడు చిట్టి.

నేను "సరే మామా! నువ్వసలు విషయం చెప్పకుండా నన్ను ఇబ్బంది పెడ్తున్నావు. నేను ఏదైనా చెయ్యాలనుకుంటే తప్పకుండా చేస్తాను. అది నీకు తెలుసు కదా" అన్నాను.

"బాబూ! ఇది చాలా రహస్యంగా చేయాల్సిన పని. ఐతే బాగా గిట్టుబాటయ్యే దారి. ఈ పని సమర్ధంగా చేస్తే మనం ఇక తిరిగి చూసుకోవలసిన పని ఉండదు. కాసులే కాసులు" అన్నాడు చిట్టి.

"సరే మామా నేను నీకు మాట ఇస్తాను. అదేంటో ఇకనైనా చెప్పు" అని నేనన్నాను.

చిట్టి నాకు కొంచెం దగ్గరకు జరిగి "నీకు మైలారుగడ్డలో ప్రతాప్ తెలుసు కదా" అన్నాడు.

నేను "ఔను తెలుసు! అతనే కదా నీ దగ్గరకు అప్పుడప్పుడూ ఫియట్ కారులో వస్తుంటాడు. మెడలొ పెద్ద బంగారు గొలుసు ఇంకా చేతి నిండా ఉంగరాలు పెట్టుకుంటాడు" అన్నాను.

"అరే! బాగానే గమనించావే! ఔను మరి తను ఎలా సంపాదించాడో తెలుసా? రైల్వేలో కాంట్రాక్టు పనులు చేస్తున్నట్లు అందరికీ చెప్తాడు. కానీ ఎన్నో ఏళ్లుగా తెలివిగా రైల్వే స్టోర్స్ ఇంకా రైల్వే స్టేషన్లో సరుకు రవాణా పనులలో అక్రమంగా కొట్టేసి ఘరానా మనిషిగా చలామణి అవుతున్నాడు" అన్నాడు చిట్టి.

"ఔనా! మరెప్పుడూ పట్టుబడ లేదా" అని నేను అడిగాను.

"అదే కదా నేను చెప్పేది. చాలా మంది గొప్పవాళ్ళ ఘన కార్యాలు ఇలానే ఉంటాయి" అన్నాడు చిట్టి.

"ఏమి చేసినా జాగ్రత్తగా ప్రణాళిక ప్రకారం చేయాలి. ఇప్పుడు నీకెందుకు చెప్తున్నానంటే మనం కూడా ఇదే అమలు పరచి త్వరలోనే పై మెట్లెక్కాలని. నువ్వు నాకు గట్టి తోడుగా ఉంటే చూడూ ఏడాది తిరిగేలోపు నువ్వు ఊహించని ఆర్ధిక స్థాయికి చేరుకుంటావు" అని చిట్టి నాకు ఎంతో భరోసాగా చెప్పాడు.

"ఇక నువ్వీ విషయంలో ఏమీ ఆలోచించకు. నేను దగ్గరుండీ అన్నీ ప్లాన్ చేస్తా. నువ్వు మాత్రం ఎట్టి పరిస్థితులలో మన ప్లాన్ ఎవ్వరితో చెప్పకూడదు మీ ఆవిడతో సహా" అని చిట్టి నా దగ్గర మాట తీసుకున్నాడు.

చేతిలో అస్సలు డబ్బులు ఆడక కష్టంగా రోజులు వెళ్లదీస్తున్న సమయంలో చిట్టిని నమ్మి తనతో జత కట్టడానికి పూర్తిగా సన్నద్ధమైపోయాను. కొద్దీ రోజులలోనే చిట్టి నాయకత్వంలో నేనూ ఇంకో అతను మా అక్రమ కార్యాలను అమలు పరచటం మొదలు పెట్టాము. అన్యాయపు సొమ్ము త్వరలోనే నాకు అందుబాటులోకి వచ్చి నా అప్పులన్నీ తీరిపోగా ఇంకా డబ్బు మిగలటం మొదలయ్యింది.

ఇదే సమయంలో చిట్టి నన్ను వెంటనే దూరంగా ఇల్లు మార్చేయాలని చెప్పాడు. మేము చేస్తున్న పని గురించి చుట్టపక్కాలెవ్వరూ ఆరా తీయకుండా తొందర పడమన్నాడు.

నేను కూడా సరేనని, అందరితో నాకు ఒక ప్రైవేట్ ఫ్యాక్టరీలో మంచి ఉద్యోగం వచ్చిందని చెప్పి, వెంటనే నా కుటుంబంతో సహా దూరంగా బొల్లారంలో ఒక చిన్న బస్తీలో ఇల్లు తీసుకుని అక్కడకి మారిపోయాను.

అప్పుడప్పుడూ సీతాఫలమండి వచ్చి అక్కని, దగ్గర చుట్టాలని కలిసి రైల్వే కాంట్రాక్టు పనుల కోసం బయట ఊళ్ళకి వెళ్తున్నందున తరచు ఇటువైపు రావట్లేదని చెప్పేవాణ్ని. ఇప్పుడు నాకు చాలా బావుందని చెప్తే అందరూ సంతోషించారు నేను చాలా కాలానికి కుదురుకున్నానని.

చిట్టి కూడా ఏమీ తెలియని వాడిలా నన్ను క్లుప్తంగా పలకరించి వెళ్లి పోయేవాడు. వీళ్లెవరికీ నా విషయంలో తన పాత్ర గురించి తెలియకుండా, చక్కగా పకడ్బందీగా వ్యవహరించే వాడు. రాఘవ బావకి కూడా నా అక్రమ వ్యవహారం గురించి తెలియకుండా నేను జాగ్రత్త పడ్డాను. కానీ జోగారావుకి మాత్రం ఉన్నట్టుండి నేను డబ్బులు బాగా సంపాదించడం గురించి ఏదో అనుమానంగానే ఉండేది.

డబ్బులు వచ్చి పడడంతో నేను రెచ్చిపోయి ఇంట్లో ఖరీదైన ఫర్నిచర్, పిల్లలకు, దుర్గకి మంచి బట్టలు తెగ కొనేసి ముందు జాగ్రత్త అనేది లేకుండా ఖర్చు చేసేయ సాగాను. నేనిన్నాళ్ళూ పిల్లలకు, దుర్గకు ఏమీ కొనిపెట్టలేదు కాబట్టి డబ్బులున్నపుడే వాళ్ళు ఆడంబరంగా అనుభవించి ఆనందించాలనుకున్నాను.

ఇక్కడే నేను పెద్ద పొరపాటు చేసాను. వచ్చిన డబ్బేదైనా జాగ్రత్తగా మిగుల్చుకుని కష్ట కాలంలో తర్వాత అవసరాలకి దాచుకోవాలన్న తెలివి లేకపోయింది. కనీసం చిట్టిని చూసైనా నేను నేర్చుకోలేదు. చిట్టి మాత్రం ఎక్కడా ఏ ఆర్భాటం లేకుండా తన సంపాదన బయట పడకుండా మామూలుగా ఉండేవాడు.

ఒక రోజు సుగుణక్క ఇంటికి పిల్లలని బాగా ఖరీదైన బట్టలతో ముస్తాబు చేయించి తీసుకెళ్ళాను. అక్క వాళ్ళని చూసి ముచ్చట పడింది. కానీ నా శృతి మించిన వ్యవహారం గమనించి నాతో "ఏరా! నీకిన్ని డబ్బులు ఎక్కణ్ణించి వస్తున్నాయి? నువ్వేమీ పొరపాట్లు చేయడం లేదు కదా" అనింది.

నేను "ఏమీ లేదక్కా. నువ్వేమీ కంగారు పడకు. ఏమీ ప్రాబ్లెమ్ లేదు" అన్నాను.

అక్క తిరిగి ఏమీ అనకపోయినా తన చూపుతోనే నాకర్థమయ్యింది తనకు నా వ్యవహారం గురించి సందేహంగానే ఉందని. అందుకే ఈ సంగతి నుంచి ఆమె ధ్యాస మళ్లించడానికి "అవునక్కా! ఏంటి సాయంత్రం

పూటలలో కూడా బావ కనపడటం లేదు" అన్నాను.

"అవునురా! బావ మా బాధ్యతలు తీరటానికి ఎంతో కష్ట పడ్తున్నారు. ఆఫీస్ అవ్వగానే రాత్రి తొమ్మిదింటి

దాకా కాంటీన్లో అకౌంట్స్ చూసే పని కూడా ఒప్పుకున్నారు. బావకి ఎంతో ఇష్టమైన రచనలు, నటన, నాటకాల

దర్శకత్వం కూడా పూర్తిగా మానేసి విపరీతంగా కష్ట పడుతున్నారు. మేము కట్టిన ఈ ఇల్లు చిన్నదే అయినా దీని

మీద అప్పు తీర్చేయాలని, లక్ష్మి పెళ్ళికి ఇంకా వంశీ పై చదువులకు ఏర్పాట్లు చేయాలని బావ ఎంతో శ్రమిస్తున్నారు"

అని అక్క నిట్టూర్చింది. అక్క పిల్లల్లో నా పెద్ద మేనకోడలు లక్ష్మికి నేనంటే అభిమానం ఇంకా జాలి. చిన్నది దామినికి ఇంకా ఏమీ

తెలియదు కానీ వంశీ మాత్రం నాకు కొంచెం దూరంగానే ఉండేవాడు. వాడి బామ్మకి నేనంటే ఇష్టం లేదు కాబట్టి

వీడు కూడా అలాగే ఉండేవాడు. నేను వెంటనే బయటకు వెళ్లి అక్కకి, లక్ష్మికి ఇష్టమైన జీడీపప్పు పకోడీలు, మిర్చి బజ్జీలు కొని వాళ్ళకిచ్చి

త్వరగానే తిరిగి ఇంటికి బయలుదేరాను. కానీ నా మనస్సులో అలజడి మొదలయ్యింది. ఎవరిని ఎంత మభ్య పెట్టినా అక్కకి మాత్రం వాస్తవం తెలిస్తే తట్టుకోలేదని నాకూ తెలుసు. నేను కూడా ఈ అక్రమ మార్గం నుంచి

పట్టుబడకుండా త్వరగా బయటపడి ఏదైనా చిన్న బిజినెస్ చేయాలని నిశ్చయించుకున్నాను.

కొన్ని రోజుల తర్వాత మేము విజయవాడ దగ్గరొక పని ముగించుకుని రైల్లో సికింద్రాబాద్ తిరిగొస్తున్నాము.

ఇలాంటి కార్యక్రమంలో మేమెప్పుడూ కలిసి దగ్గరగా కూర్చుని ప్రయాణించము. మా జట్టు వాళ్లంతా ఒకరికొకరు

తెలియనట్లుగానే ప్రవర్తిస్తాము. ఇంతలో దూరంగా కూర్చున్న చిట్టి హఠాత్తుగా లేచి, నాకొక ప్రమాద సైగ చేసి పక్క బోగీలోకి వెళ్ళిపోయాడు. ఇంతకు మునుపే నాకు చిట్టి చాలా గట్టిగా చెప్పాడు ఏదైనా చిక్కు వస్తే తన పేరు ఎట్టి పరిస్థితులలోనూ చెప్పకుండా వ్యవహరించాలని. ఏమైందని నేను పూర్తిగా ఆలోచించే లోపే నన్ను ఒక రైల్వే ప్రొటెక్షన్

ఫోర్స్ అధికారి సమీపించి, నా సూట్ కేసు తీసుకొమ్మని చెప్పి నన్ను పట్టుకుని బోగీ చివరికి తలుపు దగ్గరికి తీసుకెళ్లాడు.

నేను " ఏమైంది సర్! ఎందుకు నన్ను ఇలా తీసుకొచ్చారు" అని అడుగుతుండగానే అతను "నువ్వు కామ్ గా ఉండు చెబుతా" అన్నాడు. అతనికి తోడుగా ఉన్న ఒక కానిస్టేబుల్ నా పక్కకొచ్చి నన్నుగట్టిగా కదలకుండా చేసాడు. ఇంతలో సికింద్రాబాద్ స్టేషన్ వచ్చింది. రైలు ఆగగానే నన్నుగట్టిగా పట్టుకుని క్రిందకు దింపి,

గబ గబా స్టేషన్ సెక్యూరిటీ ఆఫీసుకి తీసుకెళ్లి విచారించడం మొదలు పెట్టారు. అక్కడి అధికారులు అడిగే ప్రశ్నలకు నేను ఎంతో బుకాయించినా కొద్దీ సేపటికి మా అక్రమ వ్యహారం ఋజువులు చూపి నన్ను అరెస్ట్ చేశారు. వాళ్ళు ఎంత గుచ్చి గుచ్చి అడిగినా ఇదంతా నేనొక్కడినే చేసానన్నాను.

దీంతో వాళ్ళు నన్ను అక్కడే నిర్బంధించి తరువాత జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ దగ్గర బోనులో హాజరు పరచారు.

నేను చిట్టితో జట్టు కట్టిన మొదట్లోనే చిట్టి నాకు బాగా ట్రైనింగ్ ఇచ్చాడు, ఒక వేళ మా అక్రమ వ్యవహారంలో

ఎప్పుడైనా పట్టుబడే తప్పనిసరి పరిస్థితి వస్తే, ఏదైనా ఒక నేరం ఒప్పుకుని మిగతా వాళ్ళ పేర్లు బయట పడకుండా.

**ఇంకెప్పుడూ** ఇటువంటి పనులకు పాల్పడనని మొర పెట్టుకున్నాను. నా తరపు న్యాయవాది ఎవరూ లేనందున నా వాదన విని మేజిస్ట్రేట్ నాకు ఒక ఏడాది సాధారణ జైలు శిక్ష, ఇంకా రెండు వేల రూపాయల జరిమానా విధించారు. అది కట్టని పక్షంలో ఇంకొక మూడు నెలల అదనపు శిక్ష ఖరారయ్యింది. హు! అలా నా చెరసాల ప్రవేశం జరిగింది.

జైలర్ నీ పేరేంటన్నారు. "విజయ్ బాబు" అన్నాను.

"మరి జైలు ఆర్డర్లో ఇక్కడ బాబురావు అని ఉందేంటి" అన్నారు జైలర్.

నేను "అవును నా స్కూల్ రికార్డ్ లో అలాగే ఉంది" అన్నాను.

ఆయన "ఏం చదివావు" అన్నారు.

"పి.యు.సి" అని చెప్పాను.

"అవునా! మరి ఇదేం పని?" అన్నారు జైలర్. బదులివ్వలేక సిగ్గుతో తల దించుకున్నాను.

జైలర్ "సరే! జాగ్రత్తగా ఉండు తెలిసిందా!" అని ఒక జైలు పోలీసును పిలిచి నన్నప్పగించారు.

జైలు సిబ్బంది ఇచ్చిన బట్టలు వేసుకున్నాక నన్ను లోపల ఒక పెద్ద గదిలోకి తీసుకెళ్లారు. అందులో ఇరవై మంది దాకా ఖైదీలు ఉన్నారు. ఆ గదిలో చాలా సిమెంట్ అరుగులు కట్టి ఉన్నాయి వరుసగా.

నాతో వచ్చిన జైలు పోలీసు ఒక ఖైదీని పిలిచి "ఇన్ కో ఎక్ జగహ దిఖారే తుమ్!" అన్నాడు.

"జీ సాబ్!" అని వాడు నన్ను ఆ హాల్ లో ఒక మూలనున్న అరుగు దగ్గరకు తీసుకొచ్చి

"ఛల్, యహా పే రహో. క్యా నామ్ హై తుమ్హరా!" అన్నాడు. నేను ఆ ఖైదీకి చెప్పాను.

"ఠీక్ హై. విజయ్ బులాయేంగే!" అని అతను వెళ్ళిపోయాడు.

ఖైదీలలో కొంతమంది అయ్యో వీళ్ళు కూడా ఎందుకు వచ్చారిక్కడకి అన్నట్లున్నా, మిగతా అంతా పొగరుగా, నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారు. దుమ్ము కొట్టుకుని ఉన్న అరుగును శుభ్రం చేయాలనుకున్నాను కానీ వీలు కాలేదు. జైలు వాళ్ళిచ్చిన పింగాణీ కంచం ఇంకా లోటాని తరువాత బయటికెళ్లినప్పుడు నల్లా దగ్గర శుభ్రం చేసుకున్నాను. అరుగు మీద కూర్చున్న నాతో పక్కన కూర్చున్న వాళ్ళు ప్రశ్నలు వేయడం మొదలెట్టారు.

ఎగసి వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ అన్యమనస్కంగానే ఏదో సమాధానమిచ్చాను. అరుగు మీద పడుకుని నాలో నేనే ఎంతో బాధ పడ్డాను. దేవుడా! ప్రక్క దారి పట్టాను. తాత్కాలిక ప్రయోజనమాశించి నేను చేసిన తప్పుకు పెద్ద శిక్ష వేసావ్. ఫలితం అనుభవిస్తున్నాను. నా అదృష్టం అగాధంలో తోస్తే, బుద్ధి జైలులోకి నెట్టింది. వక్ర మార్గాన నన్నెవరో నడిపించినా నేనెందుకు నా బుద్ధి కోల్పోయి నేరం చేసాను?

దేవుడా! నేనెప్పుడేమీ నా బుద్ధి హీనతను, పాప భీతి లేకపోవడాన్ని సమర్ధించుకోవటంలేదు. కానీ తప్పులు చేస్తున్నవాళ్లందరినీ ఇలాగే జైలుకు పంపిస్తున్నావా నువ్వు? కనిపించేటట్లు చేసిన బలహీన నేరస్థులకు మాత్రమేనా ఈ జైలు శిక్ష?

లంచాలు దిగమింగడం దొంగతనం కాదా? ప్రభుత్వ ఆస్తులను దుర్వినియోగం చేయటం, స్వప్రయోజనాలకు వాడుకోవడం దొంగతనం కాదా? అప్పులను ఎగ్గొట్టి రాత్రికి రాత్రే బిచాణా ఎత్తేస్తే తప్పు కాదా? దర్జాగా ప్రభుత్వ, ప్రజల ఆస్తులను కాజేసే పెద్ద మనుషులు, నాయకులు మాత్రం దొంగలూ, నేరస్థులూ అవ్వరే!

ఇలా ఏడుస్తూ కుమిలిపోతున్న నేను తెలియకుండానే నిద్రలోకి జారుకున్నాను. తప్పని సరై మనస్సుని కుదుట పరుచుకుని త్వరగానే జైలు పరిస్థితులకు అలవాటు పడ్డాను. నాకు మాత్రం ఇంట్లో వాళ్ళ గురించి ఏమీ వివరాలు తెలియట్లేదు.

చిట్టి ఏమి చేస్తున్నాడో తెలియదు. నాకు మాట ఇచ్చిన ప్రకారం నా భార్య పిల్లలకు డబ్బులు ఇస్తున్నాడో లేదో, ధైర్యం చెబుతున్నాడో లేదో? జైలుకు వచ్చే ముందు చిట్టి ఎంతో నమ్మబలికాడు వీలైనప్పుడల్లా వచ్చి నన్ను కలుస్తానని, నా ఇంట్లో వాళ్ళను నేను తిరిగి వచ్చే దాకా బాగా చూసుకుంటానని. కానీ ఇంత వరకూ జైలుకొచ్చి మొహమే చూపించలేదు.

అప్పుడే నెల కావస్తోంది. చేతిలో ఒక్క రూపాయ లేదు. సిగరెట్లకు ఇక్కడ పరిచయమైన నర్సిమ్మ అప్పుగా అడపాదడపా ఇస్తున్నాడు. త్వరలోనే ఇంటినుంచి డబ్బులు వస్తాయని తప్పకుండా తిరిగిస్తానని నేను చాలా బ్రతిమాలటంతో రెండింతల రేటుపై ఖాతా రాసుకుంటున్నాడు.

ఇక లాభం లేదనుకుని ప్రక్క వాళ్ళ సలహా మీద జైలు కానిస్టేబుల్ దాస్ అనే వాడిని కలిసి నా పరిస్థితి చెప్పుకున్నాను. ముందు చాలా బెట్టు చేసాడు. తర్వాత సరే నీ కోసం చేస్తానని చెప్పి ఎంతొచ్చినా అందులో నలభై శాతం తనకు ఇవ్వాలన్నాడు. చేసేది లేక చిట్టి అడ్రస్ ఇంకా అక్క అడ్రస్ ఇచ్చాను.

కానిస్టేబుల్ దాస్ తన తీరిక సమయంలో ఇలాంటి పనులు చేసి బాగా సంపాదిస్తుంటాడు. నేను తనని అక్కా వాళ్ళింటికి మఫ్టీలోనే వెళ్ళమని అభ్యర్ధించాను. దాసుకి చెప్పాను మా కుటుంబాలలో నేనే జైలుకి వచ్చిన మొదటివాణ్ణిని ఇంకా ఇంటికి పోలీసులొచ్చారంటేనే బెంబేలెత్తి పోతారని, అవమానపడతారని. దానికి దాస్ "సరే, సరే నేను జూస్కుంటలే" అన్నాడు.

ఇది జరిగిన పది రోజులకి దాస్ నన్ను పిలిచి చిట్టి ఇంట్లో వాళ్ళు చిట్టి జాడ తెలియదన్నారని, తను ఇంటికొచ్చి కూడా చాలా కాలమైందని చెప్పారని. అక్కా వాళ్ళింటికి వెళితే బావ లేదని, నా మేనకోడలు లక్ష్మి తనని చూసి భయపడిందని కానీ ఆ తర్వాత అక్క మాట్లాడిందని చెప్పాడు.

దుర్గ అంతకు ముందే అక్కకు నన్ను జైలుకు పంపించారని చెప్పినందువల్ల దాస్ వచ్చినప్పుడు అక్క అతని మాటలు నమ్మగల్గింది. తన ఇంటి ఖర్చు కోసం బావ ఇచ్చిన డబ్బులు దాసుకి ఇచ్చి అక్క నేనెలా ఉన్నానని అడగలేక అడిగిందట.

ఖైదీల జీవితం సినిమాలలో చూపించినట్లు చాలా భయంకరంగా ఊహించుకునే వాళ్ళప్పుడు. అక్క దాసుకి కొంచెం డబ్బుతో పాటు రెండు దుప్పట్లు ఇంకా తువ్వాళ్లు కూడా నాకివ్వమని ఇచ్చింది. దాస్ నాకు అక్క ఇచ్చిన బట్టలతో పాటు కొంత డబ్బిచ్చాడు. దీంట్లో తను ఎంత నొక్కేసాడో తెలుసుకునే పరిస్థితి కాదు నాదిప్పుడు.

త్వరగానే నన్నునేను సమాధానపరచుకుని జైలులో మిగతా వాళ్లకు సహాయకారిగా ఉండడం మొదలు పెట్టాను. జైలులో మెల్లగా నేనంటే మిగతా ఖైదీలు కొంచెం గౌరవంగా చూడటం మొదలైంది. బొగ్గు, సుద్ద ముక్కలతో నేను గీసే బొమ్మలు వాళ్లకు బాగా నచ్చుతున్నాయి. ఒక రోజు నేను మూడు గంటలకు పైనే శ్రద్ధగా నాకిష్టమైన వేంకటేశ్వర స్వామి బొమ్మ నేల మీద చిత్రించాను.

ఇది చూసిన ఖైదీలందరూ చాలా అబ్బుర పడి మెచ్చుకున్నారు. ఈ విషయం జైలర్ గారికి కూడా తెలిసింది. ఆయన కూడా ఈ చిత్రాన్ని చూసి ముగ్ధుడై నన్ను అభినందించారు. ఈ సంఘటన తరువాత నాకు రోజూ మామూలు పనులు, ఏవైనా లెక్కలు చూడటం వంటి పనులు అప్పగించడం మొదలైంది.

ఒక రోజు జైలర్ గారి నుంచి పిలుపొచ్చింది. జైలు ఆవరణలోనే ఉన్న వాళ్ళింటికి రమ్మని. ఎందుకు పిలిచారబ్బా అని సంశయంగా వెళ్లిన నన్ను జైలర్ గారు "రా విజయ్!" అని వాళ్ళ హాల్ లోకి పిలిచారు.

జైలర్ గారు "మా అబ్బాయి ప్రదీప్ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. డాక్టర్ అవ్వాలనుకుంటున్నాడు. తనని అందుకే బయాలజీ గ్రూప్ లో చేర్పించాను. నీవు నాకొక సహాయం చేయగలవా? ప్రదీప్ కి బోటనీ, జువాలజీ పాఠ్యంశాలలో అవసరమైన డ్రాయింగ్స్ సులువుగా వేసే మెళకువలు వాడికి నేర్పగలవా" అని అడిగారు.

నేను "తప్పకుండా చేస్తాను సర్" అని చెప్పాను.

జైలర్ గారికి వాళ్ళబ్బాయి బాగా చదివి ఎలాగైనా మెడికల్ కాలేజీలో సీట్ సంపాదించాలని ఆరాటం. ఆయన ప్రదీప్ ని ఎప్పుడు అడిగినా, నేను బాగా చదువుతున్నాను నాన్నా, నాకు అన్నీ వచ్చు అని ధీమాగా అంటున్నాడు.

జైలర్ గారు వాళ్ళబ్బాయిని పిలిచి "ఇదిగో ప్రదీప్ ఇతను విజయ్. నీకు నీ సబ్జక్ట్ డ్రాయింగ్స్ సులువుగా వేయడానికి సహాయ పడతాడని పిలిచాను. నీవు ఇతని దగ్గర డ్రాయింగ్ మెళకువలు నేర్చుకో" అని చెప్పారు.

ప్రదీప్ సందేహంగానే తలూపుతూ నన్ను ప్రక్క గదిలోని తన టేబుల్ దగ్గరకి తీసుకెళ్లి, తన ల్యాబ్ రికార్డ్స్ చూపించి "నీవిలాంటివి గీయగలవా" అన్నాడు.

నేను చెప్పాను "ప్రదీప్! నీవు నీ ల్యాబ్ రికార్డ్స్ లో కొన్ని మార్పులు చెయ్యాలి. వీటిలో ఎక్కడా కూడా నీవు వాటి టాక్సానమీ వివరాలు వ్రాయలేదు" అని. అంతే కాకుండా ఆ బోటనీ, జువాలజీ బొమ్మల తాలూకు వివరాలు చక చకా చెప్పాను.

ఆ పిల్లడు ఒక బొమ్మలా నిల్చుండి పోయాడు. వాడి జీవితంలో మొదటిసారి గొప్ప సంభ్రమాశ్చర్యానికి లోనయ్యాడు నేనిచ్చిన షాక్ కి. నేను చూడలేదు ఇదంతా మా జైలర్ గారు వెనుక నుండి గమనిస్తున్నారని. ఆయనకి కూడా దిమ్మ తిరిగిపోయింది. నేను చెప్పినవన్నీ నేనెప్పుడో పదిహేనేళ్ల క్రితం చదివిన పాఠాలు. ఐనా నా జ్ఞాపక శక్తికి, విషయ పరిజ్ఞానానికి జైలర్ గారు నివ్వెరపోయారు.

నేను అంతటితో ఊరుకోకుండా ప్రదీప్ ని అతని పాఠ్యంశాలకి సంబంధించిన ఇంకొన్ని సాధారణ ప్రశ్నలు అడిగాను. అతను చెప్పలేక నీళ్లు నమిలాడు. జైలర్ గారికి చిర్రెత్తుకొచ్చి గట్టిగా అరిచారు. చూద్దును గదా ఆయన నా వెనుకే ఉన్నారు!

"ఏరా ప్రదీప్! ఇప్పుడర్ధమయ్యిందా పరీక్షలకు నీ ప్రిపరేషన్ ఎంత ఘనంగా ఉందో? నేనెప్పుడు అడిగినా నన్ను ఏమార్చి తిరుగుతున్నావు" అని జైలర్ గారు వాళ్ళబ్బాయిని కోపంగా గదమాయించారు.

నేను "ఫరవాలేదు సర్! ఇక నుంచీ బాగా చదువుతాడు చూడండి. కొంచెం ఓవర్ కాన్ఫిడెన్స్ ఈ వయసులో పిల్లలకి సహజమే" అని నచ్చజెప్పే ప్రయత్నం చేశాను.

హు! అని జైలర్ గారు "ఇకనుంచైనా ఒళ్ళు దగ్గర పెట్టుకుని బాగా శ్రద్ధ వహించు చదువుపై" అని ప్రదీప్ పై ఉరిమి నాకు థాంక్స్ చెప్పి వేరే పని మీద వెళ్లి పోయారు.

నేను కూడా ప్రదీప్ కి చెప్పాను అతనికేదైనా సందేహాలుంటే తీరుస్తానని, అడగడానికి మొహమాటపడొద్దని.

ఆ తరువాత ప్రదీప్ చాలా సార్లు నన్ను తెలియనివుంటే అడిగి బాగా చదవటం మొదలుపెట్టాడు.

కొన్ని రోజుల తరువాత జైలర్ గారు నన్ను పిలిపించి "విజయ్ నీకు చాలా థాంక్స్. ఇప్పుడు ప్రదీప్ సిగ్గు తెచ్చుకుని బాగా చదువు మీద శ్రద్ధ వహిస్తున్నాడు. ఔనయ్యా! ఇంత ప్రతిభ నీ దగ్గర ఉంచుకుని ఎక్కడో గొప్ప స్థితిలో ఉండాల్సిన నువ్వు ఇలాంటి చోట ఉన్నందుకు నేను చాలా చింతిస్తున్నా" అన్నారు. నేను ఏం చెప్పాలో తెలియక మౌనంగా తల దించుకున్నాను.

ఈ సంఘటన జరిగిన కొన్ని నెలలకే జైలులో నా సత్ప్రవర్తనని గట్టిగా ప్రస్తావిస్తూ, జైలర్ గారు తన అధికారాన్ని ఉపయోగించి నేను జైలు నుండి త్వరగా విడుదల అయ్యేట్టు చేశారు.

*విజయ్ బాబు తుది మజిలీ*

జైలు నుండి విడుదల కాగానే అక్క దగ్గరకెళ్ళాను. నా రాకని ఊహించని అక్క ఒక వైపు నేను త్వరగా జైలు

నుండి విడుదల అయినందుకు ఊరట చెందినా, ఎంతో దుఃఖ పడుతూ ఇకనైనా నేను సక్రమ మార్గాన ఉండాలని గట్టిగా చేతులు పట్టుకు చెప్పింది.

అక్క అనింది " చూడు నువ్వు చేసిన పనికి నీ కుటుంబం ఎంత చితికి పోయిందో. దుర్గ ఇంకా పిల్లలకి నువ్వు వస్తున్నట్లు తెలియదు. ఇదిగో నా దగ్గరున్న కొంచెం డబ్బులు తీసుకో. ఇంకా కొన్ని ఇంటికి అవసరమైన సామాన్లు ఇస్తాను వాళ్ళకివ్వు" అని చెప్పి నన్ను త్వరగా నా ఇంటికి పంపించింది.

చెప్పా పెట్టకుండా ఊడిపడిన నన్ను చూసి దుర్గ ఇంకా పిల్లలు కొంతసేపు దాకా తేరుకోలేదు. పిల్లలు నన్ను గట్టిగా పట్టుకుని ఏడ్చేశారు. నేనూహించినట్లే ఇంట్లో పరిస్థితి ఏమీ బాగా లేదు. ఎలా ఉంటుంది? వీళ్ళందరూ చాలా కష్ట పడుతున్నారు.

చిట్టి అసలు వీళ్లకు ఏమీ సహాయం చేయలేదని ఇంకా అతన్ని కలవాలని వీళ్లు అతనింటికి వెళితే, నాకేమీ తెలియదని చేతులు దులిపేసుకున్నాడని చెప్పారు. నాకు చిట్టి మీద పట్టలేని కోపం వచ్చింది. తన నమ్మక ద్రోహంతో నేను ఎంతో రగిలిపోయాను.

ఆగ్రహంతో చిట్టి ఇంటికి వెళ్ళాను. చిట్టిని పట్టుకుని కొట్టబోయాను "నీ వల్ల నా బ్రతుకు సర్వనాశనమయ్యింది. అయినా నీవు కనీసం నా వాళ్ళని అస్సలు పట్టించుకోలేదెందుకు" అని చిట్టి చొక్కా పట్టుకు లాగాను.

ఈ గొడవకి చిట్టి భార్య, చుట్టు పక్కల వాళ్ళు వచ్చి బలవంతం మీద చిట్టిని నా నుంచి తప్పించారు. ఇంతలో రాఘవ బావకి కూడా ఈ విషయం తెలిసి వెంటనే వచ్చి నన్ను అక్కణ్ణించి బయటకు తీసుకెళ్లి సముదాయించాడు.

రాఘవ బావ "నీకేమైనా బుద్ధుందా? ఇంత వరకూ జరిగింది చాల్లేదా" అని కోప్పడి "అయ్యిందేదో అయ్యింది. దాన్ని నీవు తిరిగి మార్చలేవు. ఇక నుంచి ఇటువంటి వాళ్ళతో ఎప్పుడూ సంబంధం పెట్టుకోకు. చిట్టి లాంటి వాళ్ళు ఎదుటి వాళ్ళ కొంపలు ముంచి తమ స్వార్ధం చూసుకుంటారు. వాళ్ల నుంచి నీవేమీ తిరిగి రాబట్టలేవు ఊరికే ఘర్షణ, వృధా ప్రయాస తప్ప" అని నచ్చ చెప్పి, తన దగ్గరున్న కొన్ని డబ్బులిచ్చి

"ఇంటికి వెళ్లి ఇప్పుడేం చెయ్యాలో ఆలోచించు" అని నన్ను ఇంటికి పంపాడు.

జైలు నుండి త్వరగానే విడుదలయ్యాను కానీ, దీంతో నా కష్టాలన్నీ యిట్టే తీరిపోవుగా. నాకు ఉద్యోగం దొరకడం అసాధ్యమయ్యింది. దీనితో ఏదైనా చిన్న వ్యాపారం స్వంతంగా చెయ్యాలని ఆలోచించాను. చిక్కడపల్లి మార్కెట్ దగ్గర నాకు తెలిసిన ఒకతని షాపుకు ఆనుకుని ఒక చిన్న రూము ఉంది. అందులో ఒక టీ దుకాణం పెట్టుకుంటానని అతనిని చాలా బ్రతిమాలితే ఒప్పుకున్నాడు. కానీ నా చేతిలో దీనికి కావలిసిన పెట్టుబడైతే ఏమీ లేదు.

అక్క దగ్గరకు వెళ్లి ఈ విషయం చెప్పి బాధ పడితే అక్క తన దగ్గరున్న కిరోసిన్ స్టవ్, ఇంట్లో కొన్ని స్టీలు సామాన్లు ఇంకా కొంత డబ్బిచ్చింది. ఇది చూసి అక్క పెద్ద కూతురు లక్ష్మి తను ఎప్పటినుంచో దాస్తున్న పెద్ద మట్టిముంతను పగులగొట్టి అందులో డబ్బులన్నీ తీసి "ఇదిగో మావయ్యా నా దగ్గరున్నది ఇదే. ఇదంతా తీసుకో" అని ఒక చిన్న సంచీలో పోసి ఇచ్చింది.

రెండు రోజులలో నేను టీ షాప్ ప్రారంభించాను. మార్కెట్ లో చుట్టు పక్కలనున్న వ్యాపారులు ఎక్కువగా ఇష్టపడే మసాలా చాయ్ తయారు చేసి అమ్మడం మొదలు పెట్టాను. చాయ్ అమ్మకం మొదట్లో బాగానే ఉంది. కానీ వచ్చిన లాభం వచ్చినట్లుగానే ఇంటి అవసరాలకి ఖర్చు చేయడం మొదలైంది.

తర్వాత మెల్లగా వ్యాపారులందరూ చాయ్ కి వెంటనే డబ్బులివ్వడం ఆపేసారు. నెల ఖాతా వ్రాసుకో ఒక్క సారే ఇస్తామనడం మొదలెట్టారు. దీనితో నాకు చేతిలో డబ్బులాడటం తగ్గిపోయింది. అంతే కాక వచ్చిన కొద్ది డబ్బు వెంటనే ఇంటి అవసరాలకు వాడాల్సి రావటంతో, కొన్నాళ్ళకి నాకు చాయ్ తయారు చేయటానికి అప్పు చేసే పరిస్థితి ఏర్పడింది.

ఏ వ్యాపారమైనా బాగా నడవాలంటే అది నిలదొక్కుకునే దాకా, కొన్ని నెలలైనా కావలసిన పెట్టుబడి ఇంకా ఇచ్చిన అప్పులు రాబట్టుకునే తెలివితేటలు లేకపోతే ఎలా సాధ్యమౌతుంది?

ఏముంది! దీని పర్యవసానం నేను మళ్ళీ వీధిన పడ్డాను. తిరిగి అక్కా వాళ్లను సహాయం అడిగే పరిస్థితి కూడా లేదు. అక్కా వాళ్ళు కూడా ఆ మధ్యే అప్పు చేసి తాతగారిచ్చిన స్థలంలో ఒక చిన్నఇల్లు కట్టుకున్నారు. ఇంకా కరెంటు కనెక్షన్ కూడా లేదు. సాయంత్రమయ్యే సరికి అక్క గాజు దీపపు బుడ్డీలు శుభ్రం చేసి పిల్లలు

చదువుకోవటానికి ఏర్పాట్లు చేస్తుంది.

మేనల్లుడు వంశీ కూడా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అక్కకి వాడు డాక్టర్ అవ్వాలని ఎంతో ఆకాంక్ష. అక్క చెప్పింది వంశీకి నేనంటే చిరాకుగా ఉందని. అసలే చదువుకోవటానికి విద్యుత్ దీపాలు కూడా లేక ఇబ్బంది పడుతున్న సమయంలో ఎడతెగని నా సమస్యలతో వాడికి చిర్రెత్తుతోందని.

నిజమే! వాళ్ళింట్లో పెద్ద వాళ్ళ నుంచి క్రమశిక్షణ, మంచి అలవాట్లు, స్వాభిమానం అలవర్చుకున్న వంశీ నా మీద కోపమో, అసహ్యమో పెంచుకోవడంలో తప్పులేదు.

నేను చాయ్ షాప్ పెడుతున్నప్పుడు వాడికి కొంచెం ఆసక్తి ఇంకా ఆశ కూడా కలిగింది నేను దీంట్లో కుదురుకుంటానని. కానీ నేను తిరిగి యధా ప్రకారం దీన స్థితికి రావడంతో వాడు బాధపడి చాలా అసహనానికి కూడా గురయ్యాడు. నా వ్యాపారం గడవనప్పుడు కూడా నేను బానే ఉందని చెప్పి, ఈ రోజు హఠాత్తుగా చేతులెత్తేసి అక్కని ప్రాధేయపడటం చూసి వాడికి నా మీద జాలి కలుగకపోగా ఆగ్రహమొచ్చింది.

రోజులు భారంగా గడుస్తున్నాయి. ఏమైనా చిన్న చిన్న పనులు దొరికితే చేస్తున్నాను. కానీ నా దరిద్రం నా కుటుంబాన్ని ఎప్పుడూ వెంటాడుతోంది.

ఒక రోజు జోగారావు కనిపించి చెప్పాడు "బాబూ! నిన్న రాఘవరావుకి గుండె నొప్పి వస్తే రైల్వే హాస్పిటల్ లో చేర్చారు" అని. పరుగున నేను అక్కా వాళ్ళింటికి వెళ్ళాను. లక్ష్మి చెప్పింది మొన్నరాఘవ బావ రాత్రి ఒంటి గంట వేళప్పుడు లేచాడట. మంచి నీళ్ల కోసం వెళ్తుండగా దబ్బున నిలువెత్తు మనిషి కింద పడి స్పృహ తప్పాడట. మొహం మీద నీళ్లు చల్లి కొంచెం సేపు సపర్యలు చేసిన తర్వాత బావకి స్పృహ వచ్చిందట.

అక్క చాలా ఆందోళన పడి వెంటనే తాతగారి దగ్గరకెళ్ళి చెబితే అంత రాత్రి వేళ, ఆయన అక్కా వాళ్ళింటికి తన హోమియో మందుల డబ్బాతో వచ్చి బావకి మందులు ఇస్తూ కూర్చున్నారట. కొంత సేపటికి బావ బాగానే కోలుకున్నాడట. తెల్లవారగానే తాతగారు బావని రైల్వే హాస్పిటల్ లో చెకప్ చేయించమన్నారట.

లాలాగూడ రైల్వే హాస్పిటల్ చేరగానే వాళ్ళు బావని బాగా పరీక్ష చేసి వెంటనే ఐ.సి.యూలో చేర్చి ట్రీట్మెంట్ మొదలు పెట్టారట. చిన్నవాడైనా వంశీ కంగారు పడకుండా వాళ్ళ నాన్న దగ్గర ఉండటం చూసి కార్డియాక్ డాక్టర్ గారు మెచ్చుకున్నారట.

నేను అక్కతో వెంటనే హాస్పటిల్ కి వెళ్లి బావను చూస్తానంటే "నేనిప్పుడే అక్కడి నుంచి వచ్చాను రా! ఇప్పుడు ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. కానీ ఆయనకు ఇంకా బాగా నీరసంగా ఉంది. ఇంకా ఎవ్వరూ ఆయనని కలవటానికి వీలు లేదు. కాబట్టి ఆయనని రెండు మూడు రోజుల తరువాత డిశ్చార్జ్ చేస్తారు కదా, అప్పుడు ఇంటి దగ్గర కలుద్దువు గానీ" అనింది.

ఏ దురలవాట్లు లేని బావకి ఇంత చిన్నవయసులోనే నలభై రెండేళ్లకే హార్ట్ ఎటాక్ రావడం అందరికీ చాలా ఆశ్చర్యం కలిగించింది. ఎక్కువ సేపు కూర్చుని పని చేయటం తోటి, పని ఒత్తిడి వల్ల ఇలా జరిగిందేమోనని అన్నారు.

తన చిన్న చెల్లెలు వ్యవహారం వల్ల కూడా మానసికంగా ఈ మధ్య బావ బాగా కలత చెందాడని తెలిసింది.

ఒక వారమయ్యాక బావ ఇంటికి తిరిగి వచ్చాక కలిసాను. బావ "ఏం బాబూ, బావున్నావా" అని అడిగాడు. నేను "బావున్నాను బావా. మీరు నీరసంగా ఉన్నారు, బాగా విశ్రాంతి తీసుకోండి" అని చెప్పి త్వరగానే బయటికి వచ్చేసాను.

అక్కతో నేను బావకి ఏం సహాయం చేయగలనని నిట్టూర్చాను. అక్క "ఏం ఫరవాలేదు రా! మేమంతా ఉన్నాము కదా. రామేశ్వరి అత్త కూడా వచ్చింది. ఇంకా నీకు తెలుసు కదా నా మరుదులందరూ కూడా ఆయనకు ఎప్పుడూ సహాయంగా ఉంటారు. నాకేమీ దిగులు లేదు" అంటూనే కన్నీళ్లు పెట్టుకుంది.

ఎంతైనా అక్క కూడా చిన్నదే కదా, పిల్లలు కూడా చిన్నవాళ్ళే. అందువల్ల అందరూ బాగా ఆందోళనగా ఉన్నారు. ఈ విషయమే ఆలోచిస్తూ ఇంటి వైపు నడుస్తున్న నాకు దూరాన చిట్టి కనపడ్డాడు. తానూ నన్ను చూసాడు కానీ చూడనట్లే మొహం పెట్టి మెల్లిగా పక్క సందులోకి జారుకున్నాడు.

చిట్టి నన్నీ ఊబిలోకి లాగి తాను అమాయకుడిలా, పెద్దమనిషిలా బయట చలామణి అవుతున్నాడు. చిట్టి వ్యవహారమే వేరు. తనేదో రైల్వే ఆఫీస్ పనుల మీద క్యాంపులకి నెలల తరబడి దూర ప్రాంతాలకు వెళ్తాడని చుట్టు ప్రక్కల వాళ్లకి, బంధువులకీ అభిప్రాయం కలిగించాడు. అలాగే తరచు బయటికెళ్తూ రాత్రి వేళల్లోనే ఇంటికి తిరిగి వచ్చేవాడు.

ఘరానా మనుషుల వ్యవహారం పకడ్బందీగా ఉంటుంది. కొంత మందికి వీరి మీద సందేహం కలిగినా నేరుగా దీని గురించి అడగడం గాని, ఆరా తీయటం గాని చేసే ధైర్యముండదు.

ఎప్పుడూ క్రొత్త చోట్ల అప్పులు చేయటం, ఉద్యోగాలు, పనులు చేసి పెడతానని జనాల దగ్గర డబ్బులు రాబట్టి తరువాత క్యాంపులకు వెళ్లినట్లు తప్పించుకు తిరగటంలో చిట్టి బాగా ఆరితేరాడు. పొరపాటున అప్పుల వాళ్ళు ఎదురు పడినా ఏ మాత్రం తొణకకుండా దర్జాగా తిరిగి వారి మీదకే ప్లేట్ ఫిరాయించే వాడు.

కానీ ఈ వ్యవహారం ఎల్ల కాలం సాగదు కదా. కొన్నాళ్ళకి ఈయన బాధితులు ప్రక్కనే ఉన్న కేశవ ఇంటికి వెళ్లి తాతగారిని కూడా కలిసి ఆయనకు తమ గోడు వెళ్లబోసుకోవడం ఎక్కువయ్యే సరికి తాతగారు తీవ్ర ఆగ్రహంతో చిట్టిని కొట్టడానికి వెళ్లారు.

వయసు పైబడ్డ తాతగారు చిట్టి విషయంలో బాగా బలహీన పడ్డారు. ఎంతో ఆవేదనకు లోనైన ఆయన చిట్టితో మాట్లాడడం గానీ, వాళ్ళింటికి వెళ్ళటం గానీ పూర్తిగా మానేశారు. కొన్నాళ్ళకి తాతగారికి తెలిసింది చిట్టిని రైల్వే ఆఫీస్ అధికారులు పని లోంచి సస్పెండ్ చేసారని. ఆయన చాలా బాధ పడ్డారు.

చిట్టికి అప్పటికే ముగ్గురు పిల్లలు పుట్టారు. స్కూల్ కి కూడా వెళ్తున్నారు. తాతగారు వాళ్ళ గతేమిటని దిగులు పడ్డారు. బాగా ఆలోచించి చిట్టి భార్య పద్మజని తను పదవ తరగతి పాస్ అవ్వటం వలన అందుకు తగిన టీచర్ ట్రైనింగ్ లో చేర్పించి, ఆ తరువాత తనకు తెలిసిన స్కూల్ లో ఉద్యోగం ఇప్పించారు.

అదే నా విషయంలో మాత్రం తాతగారు ఏ సహాయం చేయక నాకెప్పుడూ మొండి చేయి చూపించారు. ఎందుకు ఆయనకు నేనంటే అంత కోపమని నాకు చాలా బాధగా ఉండేది. అందుకే ఎవరైనా ఆయన గురించి

గొప్పగా చెబితే, హు! మీకేం తెలుసు ఆయన నా బతుకు ఎలా నాశనం చేసాడో అని విమర్శించే వాణ్ని.

అందరూ ఎప్పుడూ నా తప్పులు బలహీనతలు మాత్రమే చూస్తే, రాఘవ బావ ఒక్కడే నన్నెప్పుడూ బాధ పెట్టలేదు. ఎప్పుడైనా అత్యవసరమైనప్పుడు బావ ఆఫీసుకు వెళ్లి డబ్బులడిగే వాణ్ని. పాపం తనకున్న పెద్ద కుటుంబ బాధ్యతలు, ఆర్ధిక పరిమితుల దృష్ట్యా వీలైనంత ఆదుకునే వాడు. అంతేగానీ డబ్బులిచ్చాడు గదాని హిత బోధలు చేసేవాడు కాదు. అందుకే నాకు బావంటే చాలా కృతజ్ఞత, గౌరవం.

ఇప్పుడు బావ ఉన్న పరిస్థితిలో ఇక నాకున్న కొద్దిపాటి సహాయం అందే అవకాశం కూడా పూర్తిగా సన్నగిల్లింది. ఐనా ఇక మీదట ఏమైనా సరే అక్కని బావని డబ్బులడిగి ఇబ్బంది పెట్టకూడదు అని గట్టిగా అనుకున్నాను.

బావ ఆరోగ్యం ఇంకా ఆర్ధిక స్థితిని దృష్టిలో పెట్టుకున్న నా పెద్ద మేనకోడలు లక్ష్మి డిప్లొమా కోర్స్ చేసి, పద్దెనిమిది ఏళ్లకే స్టెనోగ్రాఫర్ గా ప్రైవేట్ ఉద్యోగంలో చేరింది.

మా బంధువులందరూ ఆడపిల్ల ఇంత చిన్నవయస్సులోనే ఉద్యోగం చేయడం చాలా గొప్పగా చెప్పుకుని మురిసిపోయారు. కొన్నాళ్ళకి నాకూ ఈ విషయం తెలిసి అక్క వాళ్ళింటికి వెళ్ళాను దాన్ని అభినందించడానికి. ఉద్యోగం చేసే అమ్మాయైతే తక్కువ కట్నంతో పెళ్లి జరిగే అవకాశముండేది అప్పట్లో.

నేను "మీ నాన్నకు నీ పెళ్లి భారం తగ్గిస్తున్నావు. నీవింకా బాగా వృద్ధిలోకి రావాలి" అని మనస్ఫూర్తిగా లక్ష్మిని ఆశీర్వదించాను. "మావయ్యా చాలా థాంక్స్! నాకివ్వాళే మొదటి జీతం ఇచ్చారు" అని లక్ష్మి చాలా సంతోషంగా చెప్పింది.

"ఏదీ మరి సెలబ్రేషన్ ఏంటీ" అని నేననగానే అది కూడా "రెడీ మావయ్యా! నేను ఆఫీస్ నుంచి వచ్చేప్పుడు జిలేబి ఇంకా మిరపకాయ బజ్జీలు తీసుకొచ్చాను. నీకిష్టమైన బజ్జీలు ఇదిగో వేడిగా ఉన్నాయి" అని ఒక ప్లేటులో వెంటనే పెట్టి ఇచ్చింది. లక్ష్మి చూపించిన ఆప్యాయతకి నాకు ఎంతో ఆనందమేసింది.

అక్కా వాళ్లందరితో సరదాగా కబుర్లు చెప్తుండగా బావ కూడా ఆ రోజు త్వరగానే ఆఫీస్ నుంచి వచ్చేసాడు. నేను "కంగ్రాట్స్ బావా! లక్ష్మి అప్పుడే చాలా పెద్దదై పోయింది" అన్నాను. బావ నవ్వుతూ "ఏమనుకున్నావురా మా అమ్మడంటే!" అని మురిసిపోయాడు.

అక్క నన్ను భోంచేసి వెళ్ళమంది. కానీ నేను "లేదక్కా మళ్ళీ వస్తాను" అని బయలుదేరాను. లక్ష్మి నన్ను "ఒక్క నిమిషం మావయ్యా" అని ఇంటి గేటు దగ్గర ఆపింది.

లక్ష్మి "ఇదిగో నీకు నా గిఫ్ట్ మావయ్యా" అని నా చేతిలో వంద రూపాయలు పెట్టి భుజం తట్టింది. నేను "అదేంటే నాకొద్దు. మళ్ళీ ఎప్పుడైనా అవసరమైతే అడుగుతానులే" అంటే, లక్ష్మి "అప్పటి సంగతి చూద్దాంలే నువ్వింక ఏమీ మాట్లాడకు, బయలుదేరు" అని నవ్వుతూ పంపించింది.

చిన్నదైనా అది చేసిన పనికి ఇంకా దాని ఆప్యాయతకి నాకు దుఃఖం ఆగలేదు. నా కన్నీళ్లను ఆపుకుంటూ చల్లగా ఉండమ్మా అని గబ గబా అక్కణ్ణించి బయలుదేరాను.

కొన్నిరోజుల తరువాత దుర్గ పిల్లలతో ఏదో గట్టిగా ఎవరి మీదో కోపంగా అంటూ ఇంటికి రావడం చూసాను.

"ఏమైంది?" అని అడిగాను. దుర్గ "మీ మేనల్లుడు వంశీ ఏంటి పెద్ద పోజు కొడతాడు. మేమెవరం వాళ్ళింటికి వెళ్లినా పలకరించకుండా వెళ్లి పోతాడు. మీ అక్కయ్యగారు మాత్రం తనకి సాధ్యమైనంత ఏదో ఇచ్చి పంపిస్తారు. ఐనా వంశీ తన సంపాదన ఏమైనా మాకిచ్చినట్టు అలా ప్రవర్తిస్తాడేంటి" అని రుసరుసలాడింది. నాకర్థమయ్యింది నేను వెళ్లకపోయినా దుర్గ తప్పనిసరి అవసరాలకి అక్క దగ్గరకి వెళ్తోందని. వీళ్ళని నేనే పంపించాను అని వంశీ అనుకుంటున్నాడేమో. హు! నేనేం చేస్తాను. వీళ్లకు నేనేమీ చేయకపోగా వీళ్ళు అక్క దగ్గరకి వెళ్లకుండా ఎలా ఆపగలను అని బాధ పడ్డాను.

ఇక మీదట నువ్వు వెళ్లొద్దు. పిల్లలను కూడా తీసుకొని అక్క దగ్గరకి వెళ్లొద్దు అని దుర్గకి చెప్పాను. ఐనా,

తను నాకు తెలియకుండా వెళుతూనే ఉందని తర్వాత ఒక సంఘటన ద్వారా నాకు తెలిసింది. దుర్గ ఎప్పుడైనా అక్కా వాళ్ళింటికి వెళ్ళినప్పుడు అక్కడ వంశీ స్నేహితులని చూసేది. అలా వారిని గుర్తు పట్టగలిగిన దుర్గ వాళ్ళు ఎప్పుడైనా బయట కనపడితే పలకరించేది. ఒక వేళ వాళ్ళు బదులివ్వకపోతే తను వంశీ వాళ్ళ అత్తనని పరిచయం చేసుకుని చనువుగా మాట్లాడడానికి ప్రయత్నించేది. ఇంకా ఊరుకోకుండా వంశీ బాగా చదువుతున్నాడా అని వాళ్ళని అడిగేది.

అసలు నన్నే ఎవరికీ పరిచయం చేయడం ఇష్టపడని వంశీకి దుర్గ ఇలా అనవసరంగా తన స్నేహితులతో

చనువుగా ప్రశ్నలేయడం తెలుసుకుని విపరీతంగా కోపం తెప్పించింది. అక్క నాతో తర్వాత చెప్పింది. వంశీ వెళ్లి అక్కతో గొడవ పెట్టుకున్నాడట "అసలు నా విషయంలో ఆవిడ ప్రమేయమేంటి? నేనసలు వీళ్ళు నాకు చుట్టాలని చెప్పడమే ఇష్టం లేనప్పుడు వీళ్లేంటీ దరిద్రం" అని ఆగ్రహంతో ఊగిపోయాడట.

మెడికల్ కాలేజీలు నిర్వహించే ప్రవేశ పరీక్షలో వంశీ చాలా కొద్దిపాటి తేడాతో అర్హత కోల్పోయాడు. దీనితో

వాడు చాలా నిరుత్సాహ పడ్డాడు. మెడికల్ కాలేజీ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సంపాదించాలంటే చాలా కఠిన ప్రిపరేషన్ అవసరం. కానీ వంశీకి దానికి కావలసిన ప్రశాంత వాతావరణము ఇంటి దగ్గర ఉండేది కాదు.

ఎప్పుడూ ఇంట్లో ఎవరో ఒక బంధువుల తాకిడి, నా గొడవ, బావ అనారోగ్యంపై ఆందోళనతో వంశీ కఠిన

పరీక్షకు కావలసిన విధంగా ప్రిపేర్ అవ్వలేకపోయాడు. అసలే మెడికల్ కాలేజీలో సీటు రాలేదని ఎంతో దిగులుగా ఉన్న సమయంలో తన విషయంలో దుర్గ కెలకడం వంశీ తట్టుకోలేక పోయాడు.

అందుకే వంశీ "అమ్మా! ఇంకోసారి ఇలా జరిగితే నేనూరుకోను. నువ్వు వాళ్లకు చెప్పు అసలు నా విషయంలో కల్పించుకోవద్దని ఇంకా అనవసరంగా మన ఇంటికి రావద్దని" అక్కతో చాలా గట్టిగా చెప్పాడట.

నా దురదృష్టం. అనుకోకుండా ఇదే సమయంలో చిట్టి అక్రమ వ్యవహారం గురించి ఒకసారి పోలీసులు అతనింటికి వెళ్లి విచారించారు. ఆ సందర్భంలోనే నా గురించి కూడా మామూలుగా వాకబు చేసి నా అడ్రస్ తెలియక పోవటం వలన ఎవరో చెబితే అక్కా వాళ్ళింటికి వెళ్లి నా గురించి అడిగారట. పోలీసు వాళ్ళకి ఆ సమయంలో అక్కడే ఉన్న వంశీ తన కుటుంబం నాతో సంబంధం ఎప్పుడో తెంపేసుకుందని, నేనెక్కడుంటానో కూడా తెలియదని ఈ వ్యవహారాలలో ఇక నుంచి ఇబ్బంది పెట్టద్దు అని చెప్పాడట.

పోలీస్ వాళ్ళు వెళ్ళిపోగానే వంశీ అగ్గి మీద గుగ్గిలమయ్యాడు. మొదటి నుంచీ గొప్పగా బ్రతకాలని తన సమూహంలో మిన్నగా ఉండాలని తపించే వంశీకి ఈ పరిణామాలు అస్సలు మింగుడు పడలేదు.

వంశీ అక్కతో "నువ్వేం చేస్తావో నాకు తెలియదు. వాళ్ళని ఇక రావద్దని చెప్పు. నీకు ఎప్పుడైనా వీలైతే ఆర్థిక సాయం చెయ్యి. కానీ నాకు మాత్రం వీళ్లకు బాగుపడే లక్షణాలు కనిపించట్లేదు" అని ఆవేశ పడ్డాడట. వంశీ ఎప్పటినుంచో ఈ విషయమై తనతో గొడవ పడుతున్నా, ఏదో సర్దుకు పోతాడులే అని భావించిన అక్క వాడి మాటలతో ఖిన్నురాలయ్యింది.

"నేను కాకపోతే మావయ్యకి ఇంకెవరున్నారురా వాడికీ కష్టకాలంలో" అని నచ్చచెప్పటానికి చాలా ప్రయత్నించింది.

ఇంకా అక్క "ఐనా ఇది నాకు, నా తమ్ముడికి సంబంధించిన వ్యవహారం. ప్రతి దానికీ మీరు చెప్పినట్లే జరగాలా" అని కోపంగా వాదించింది.

కానీ వంశీ "మావయ్య కుటుంబ పరిస్థితి ఎప్పటికీ బాగు పడదు. ఇంకా ఈయన గారి ఘన చరిత్ర వల్ల మాకూ తల వంపులుగా ఉంది. వీళ్ళు ఇక నుంచీ మనింటికి రావటానికి అస్సలు వీల్లేదు" అన్నాడట.

"ఐనా నీకు నాన్న ఆరోగ్యం ముఖ్యం కాదా? ఇంకోసారి మావయ్య ఇంటికొస్తే నేను ఈ ఇంట్లో ఉండను" అని హెచ్చరించాడట.

"కాదంటే నేను కావాలో మావయ్య కావాలో తేల్చుకో" అన్నాడట వంశీ.

ఆ రాత్రంతా విపరీతంగా ఏడ్చింది అక్క. వంశీ తీవ్ర ఒత్తిడితో అమితంగా బాధపడ్డ అక్క ఒక భయంకర నిర్ణయం తీసుకుంది. ఆ మరునాడు ప్రొద్దున్నే నాకు అక్క నుండి కబురందింది. అక్క వాళ్ళింట్లో పాలు పోసే అతనికి నా ఇల్లు తెలుసు. అతనితో నన్నుసాయంత్రం చీకటి పడ్డాక కలవమన్నానని చెప్పి పంపింది.

ఏంటబ్బా! అక్క ఎందుకిలా పిలిచింది అని నేను కంగారు పడ్డాను. బావకేమైనా ఒంట్లో బాగోలేదా అని ఆలోచిస్తూ అలాగే అక్క వాళ్ళింటికి వెళ్ళాను. నా కోసమే ఎదురు చూస్తున్న అక్క నన్ను ఖాళీగా ఉన్న వాళ్ళింటి పక్క స్థలంలో చెట్టు దగ్గరకు తీసుకెళ్ళింది.

అప్పుడు చూసాను అక్కను దగ్గర నుండి. అక్క మొహం బాగా ఉబ్బిపోయి ఉంది. కళ్ళు బాగా వాచి ఉన్నాయి. "ఏంటక్కా! ఏమైంది?" అని ఆదుర్దాగా అడిగాను.

అక్క "బాబూ! నీకెలా చెప్పాలో తెలియట్లేదు" అని వంశీ తనతో పెట్టుకున్న విపరీతమైన గొడవ గురించి చెప్పింది. అక్క అనింది "బాబూ! చిన్నప్పుడు నువ్వు ఇంట్లో వాళ్ళతో కోపమొచ్చి అలిగి దూరంగా వెళ్లిపోతుంటే, నేను నిన్ను బుజ్జగించి తిరిగి తీసుకొచ్చేదాన్ని. కానీ పెద్దయ్యాక నా జీవితంలో దీనికి విరుద్ధ పరిస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదు"

అక్క మాటలు అర్ధమవ్వక ఆశ్చర్యపోతున్న నన్ను "బాబూ! నీకు నేనంటే నిజంగా ప్రేముంటే నేనొకటి కోరుతాను తీరుస్తావా" అని అక్క అడిగింది.

నేను "అదేంటక్కా! నేను చేయగలిగిందేదైనా వుంటే తప్పకుండా చేస్తాను" అన్నాను.

అక్క "ఐతే, ఏదీ నా తల మీద ఒట్టేసి వాగ్దానం చేయి. నీవు మాట తప్పితే నేను చచ్చినంత ఒట్టే" అనింది.

నాకు గుండె దడ దడలాడింది. ఎప్పుడూ నన్నేమీ అడగని అక్క ఇలా ఇంత తీవ్రంగా అడగ్గానే నేను గద్గద స్వరంతో "ఏంటక్కా ఇంతకీ నేనేం చేయాలో చెప్పు" అన్నాను.

అక్క నా చేయి పట్టుకుని తన తల మీద పెట్టుకుని "ఇక నువ్వెప్పుడూ మా ఇంటికి రావద్దు. రానని మాటివ్వు" అని నా కళ్ళలోకి ధృడంగా చూసి అనింది. నా జీవితంలో ఇటువంటి అత్యంత దురదృష్ట పరిస్థితి కూడా ఎదుర్కోవలసి వస్తుందని నేను కలలో కూడా ఊహించలేదు. ఆ క్షణంలో నా మానసిక వేదనని నేను వివరించలేను.

ఇది నిజం కాదేమో అని అక్కని చూస్తే అర్ధమైంది తను ఇదొక క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం కాదని. ఎంతో మానసిక సంఘర్షణకి గురై తప్పని పరిస్థితిలో అక్క ఈ భయంకర నిర్ణయం తీసుకోవలసి వచ్చిందని. ఆ రాత్రి అక్కా వాళ్ళింటి బయట దీని గురించి ఇక ఏమీ చర్చించడానికి వీలు లేని పరిస్థితిలో, వెంటనే నా మాట ఇవ్వాల్సిన అత్యంత దీన దౌర్భాగ్య క్షణాల్లో, నేను "సరేనక్కా" అని భోరుమని ఏడుస్తూ అక్కడే నేల మీద కూలబడి పోయాను. అక్క కూడా వెక్కిళ్లు పెట్టి ఏడుస్తూ వెంటనే తన ఇంట్లోకి పరుగెత్తికెళ్లి పోయింది.

ఈ తిరుగు లేని పరిణామం నా దురదృష్ట జీవితానికి పరాకాష్ట. దేవుడా! ఏమిటి నాకీ శాపం. ఎన్ని జన్మల పాపం నేను అనుభవిస్తున్నాను అని రోదించాను. అంతలోనే స్పృహ తెచ్చుకుని ఈ సంఘటన మిగతా అందరికీ తెలిసి అక్కని ఇంకా మానసిక క్షోభ పెట్ట కూడదని నిశ్చయించుకుని, అక్కడ నుండి బయలుదేరి నా ఇంటికి ఎలా తిరిగొచ్చానో నాకే తెలియదు.

## చందూ జీవితం

ఇక మా బాల్య మిత్రుడు చందూ జీవితం గురించి చెప్పబోతున్నాను.

నేను, వంశీ ఇంకా కేశవ గారబ్బాయి చందు సమ వయస్కులం. అంతే కాకుండా చిన్నపుడు మేమందరం ఒకే బడిలో చదివేవాళ్ళం. చందు వాళ్ళ తాత సాంబశివరావు గారిని నేను కూడా తాతగారనే పిలిచే వాడిని.

చందు చిన్నప్పటి నుండీ చాలా చురుకుగా ఉండేవాడు. తరచూ ఏదో దుడుకు పనులు చేస్తూ వాళ్ళ నాన్న కేశవ గారికెప్పుడూ ఆందోళన కల్గిస్తుండేవాడు. చందు వాళ్ళమ్మ గారాబమే దీనికి కారణమని వాడి తాతగారు చింతించేవారు. చందు కూడా తెలివైన వాడే కానీ చదువు మీద పూర్తి శ్రద్ధ చూపేవాడు కాదు.

చుట్టూ పక్కల ఇళ్లల్లో చెట్లెక్కడం, జామకాయలు కోయడమంటే వాడికి సరదా. ఒక్కో సారి వాళ్ళింటి బావి మీద నుంచి దూకి పక్కనున్న చిట్టి గారింటికి వెళ్లిపోతుండే వాడు. రోజూ స్కూల్ దగ్గర అమ్మే పెద్ద ఐస్ క్రీములు గొడుగు ఆకారంలో రంగుల్లో ఉండే వాటిని తినడమంటే వాడికి బాగా ఇష్టం. వాళ్ల నాన్న ఉద్యోగానికి కాలేజీకి వెళ్ళగానే వాళ్ళమ్మని బుజ్జగించో, సతాయించో వీటి కోసం డబ్బులు దొరికించుకునే వాడు.

అల్లరి బాగా చేసినా ముద్దుగాఉండే చందు అంటే చుట్టుపక్కల బంధువులందరికీ బాగా ఇష్టముండేది. చందు కూడా తన దగ్గరున్నడబ్బులతో మిగతా పిల్లలకు కూడా ఏదో ఒకటి కొనిచ్చే వాడు. చందుకి తరచూ దగ్గూ ఆయాసం వస్తుందని కేశవగారు ఎన్నో జాగ్రత్తలు చెప్పి, బయట తిళ్ళు తినొద్దని వారించినా వీడు మాత్రం వద్దన్న పనులే ఎక్కువ చేసేవాడు.

దీనితో రోజూ కేశవగారితో దెబ్బలు తినేవాడు. ఐనా కానీ వీడిలో మార్పు రాకపోవటంతో కేశవగారు తన బెల్టుతో వాడిని చితకబాదే వారు. ఇక కేశవగారు దెబ్బలు కొట్టినప్పుడల్లా వాడు పక్కనున్న మేనత్తల ఇళ్ళకి వెళ్లడం, వాళ్ళు వీడిని బాగా సముదాయించటం చేసి వాడు తినకూడని వేపుడు తిళ్ళు, వాడికిష్టమైన ఎఱ్ఱటి ఆవకాయ అన్నం పెట్టి తమ ప్రేమని చూపించే వారు.

ఇవన్నీ చూస్తున్న తాతగారికి క్రమశిక్షణ లోపించిన మనవడు చందు గురించి చాలా ఆందోళనగా ఉండేది.

చందు కూడా వార్ధక్యంలో ఉన్న తాతగారికి చిక్కకుండా తప్పించుకు పారిపోయేవాడు.

తాతగారికి అర్ధమైపోయింది చందు కూడా దారి తప్పుతున్నాడనీ. దీంతో ఆయన కష్టపడి సుగుణ గారింటికి ఊతసాయంతో నడుచుకుంటూ వెళ్లి "సుగుణా! ఏడి వంశీ ఎక్కడ? వాడిని చందుతో కలిసి ఆడనివ్వకు" అని తరచూ గట్టిగా చెప్పేవారు.

నేను కూడా వంశీతో పాటు ఎప్పుడైనా చందు వాళ్ళింటికి వెళితే, గేటు దగ్గరే కాపలా కాసే తాతగారు, మాకు వాడితో ఆడొద్దని చెప్పడం చందు వాళ్ళమ్మ గారికి బాగా కోపం తెప్పించేది. తాతగారు తన స్వంత మనవడి గురించి మిగతా బంధువుల పిల్లలకి జాగ్రత్తలు చెప్పడం ఆవిడకి ఎంతో బాధ కలిగించేది.

దీనికి తోడు మేమందరం సహాధ్యాయులం కనుక చదువులో మంచి మార్కులు సంపాదించిన మమ్మల్ని తాతగారు ఆవిడ ముందే బాగా అభినందించే వారు. అందుకే మేమెప్పుడైనా ఆవిడకి కనపడితే మమ్మల్ని చుర చురా చూసేది.

చందుకి ప్రతీది ముందే అనుభవించేయాలన్నకోరిక ఉండేది. పరిస్థితులు కూడా అనుకూలంగా ఉండడంతో మిగతా పిల్లల కంటే ముందే చాలా పనులు వయసుకు మించి చేసేవాడు. మేము మా ఇంట్లో పెద్దవాళ్ళ సైకిల్ పై చేయి కూడా వేయగలిగే వాళ్ళము కాదు కానీ, వాడు మాత్రం అప్పటికే వాళ్ల నాన్నగారి స్కూటర్ నడిపేసే వాడు. వీడు చేసే సాహస కృత్యాలు మిగతా పిల్లలకు పనులు చాలా ఆశ్చర్యాన్ని కలిగించేవి. ఇవన్నీ కేశవగారికి కోపం తెప్పించి ఆయనతో రోజూ దెబ్బలు తినేవాడు కానీ వాడు మాత్రం మానేవాడు కాదు.

ఇంటర్మీడియట్ వచ్చేసరికే చందుకి సిగరెట్లు బాగా అలవాటయ్యాయి. మేము" ఏరా చందు! ఏంట్రా ఇది? తెలివైన వాడివి, మంచివాడివి నువ్వు ఇలాంటి దురలవాట్లు ఎందుకు చేసుకుంటున్నావు" అని అడిగితే చందు "అరే! ఏం లేదు రా, ఇక చూడు రెండు రోజుల్లో పూర్తిగా మానేస్తా" అని నవ్వుతూ చెప్పేవాడు.

చందు మంచి అందగాడు. నవ్వితే బుగ్గలు సొట్ట పడి మనోహరంగా ఉండే వీడంటే అమ్మాయిలు చాలా ఆకర్షితులయ్యే వారు. ఇంట్లో గొడవ చేసి కాలేజీకి బస్సులో వెళ్లడం కష్టంగా ఉందని వాళ్ళ నాన్న స్కూటర్ తీసుకుని దాని మీద విన్యాసాలు చేస్తూ అమ్మాయిలకు లిఫ్ట్ ఇస్తూ తిరిగే వాడు.

అమ్మాయిలకే కాదు చుట్టాలెవరికైనా అవసరమైతే తన చదువు ఇంకా పనులు మానుకుని వాళ్లకి కూడా సహాయం చేసేవాడు. రాన్రాను కేశవగారి చేయి దాటి పోయాడు చందు. వీడీని అదుపు చేయటం తనకి సాధ్యం కాదని అర్ధమైపోయిన కేశవగారు వీడికి డబ్బులు అందకుండా చాలా జాగ్రత్తలు తీసుకోవటం మొదలెట్టారు.

ఈ సమయం లోనే మాకు ఒక దుర్వార్త తెలిసింది. తాతగారు రెండు నెలలుగా ఆరోగ్యం క్షీణించి ఇంట్లోనే

పరమపదించారని. తాతగారి మరణం ముదిమి వయస్సులోనే జరిగినా అది అందరికీ ఒక తీరని లోటే.

చందు డాక్టరవ్వాలన్న వాళ్ళ నాన్న కోరిక తీరలేదు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన చందు సైన్స్ గ్రూప్ నుంచి కామర్స్ గ్రూపుకి మారాడు. పైపెచ్చు ఆర్ట్స్ కాలేజీలో విచ్చలవిడితనం పెరిగి కేశవగారికి ఎంతో మనస్తాపం కల్గించాడు. డిగ్రీ ఎలాగైతేనేం పూర్తి చేసిన చందు ఉద్యోగం కోసం సేల్స్ రిప్రెజెంటేటివ్ గా చేరాడు. ఈ ఉద్యోగం వల్ల లాభం లేకపోగా చందుకి సిగరెట్లు ఇంకా డ్రింక్ చేయటం విపరీతంగా పెరిగాయి.

ఈ ఆందోళనకర స్థితికి భయపడిన కేశవగారికి ఏమీ పాలుపోక కనీసం వీడికి పెళ్లి చేస్తే మారతాడేమోనని, ఒక దిగువ మధ్య కుటుంబంలోని అమ్మాయిని వెతికి పెళ్లి చేసారు. ఐనా చందు పెళ్లయ్యాక ఏమీ మారలేదు సరి కదా, పెళ్ళాన్నికొట్టటం కూడా మొదలెట్టాడు. సులభకార్యంగా వాడికి త్వరలోనే ముగ్గురు అమ్మాయిలు పుట్టారు. వీడు మాత్రం బాధ్యత లేకుండా ప్రవర్తిస్తూ ఎన్నో ఉద్యోగాలు మారుతూ, బిజినెస్ చేస్తానని వాళ్ళ నాన్న ఆస్తిని కరిగించే కార్యక్రమంలో పడ్డాడు.

కేశవగారు మాత్రం చందు ఎంత వత్తిడి చేసినా లొంగకుండా తను ఆర్జించిన డబ్బు పెద్ద మొత్తం ముగ్గురు మనవరాళ్ల పేరిట జమ చేసేసారు. కేశవగారు రిటైర్ అయినా ప్రైవేట్ కాలేజీకి వెళ్లి లెక్చరరుగా ఉద్యోగం చేస్తూనే ఉండేవారు. ఇవన్నీ చూస్తూ కూడా చందు ఏ మాత్రం మారకపోగా నానాటికీ దిగజారి మాదక ద్రవ్యాలు తీసుకోవటానికి కూడా అలవాటు పడ్డాడు.

నలభై ఏళ్ల వయస్సుకే చందు ఆయుర్దాయం తీరిపోయింది.

ఇప్పుడు మళ్ళీ ఇలా చందూని గుర్తు చేసుకోవడం మాకు ఎంతో బాధ వేసింది.

ముగింపు

నేనన్నాను "ఔను వంశీ! చందు జీవితం చాలా త్వరగా ముగిసిపోయింది. వాడికి చిన్నప్పటినుండీ అన్నీ ఉన్నా వాళ్ళ నాన్న కేశవగారి మితిమీరిన క్రమశిక్షణ, కాబోతే వాళ్ళ అమ్మగారి గారాబం వాణ్ని పాడు చేసాయా?

వంశీ! నేననుకుంటాను ప్రతీ తరంలోనూ అవసరమైన సంరక్షణ లేకపోవడం వల్లనో లేక వారి తల్లిదండ్రుల అతి ధోరణులతోనో వాళ్ళ పిల్లలు దారి తప్పుతారేమో! దీనికి ఉదాహరణే కదా మనం చూసిన చిట్టి, విజయ్ బాబు, చందూ లాంటి వాళ్ళ జీవితాలు"

దీనికి వంశీ "ఔను శ్రీమన్! కుటుంబ పెద్దల మానసిక పరిణితి, ఆత్మ విశ్వాసం మన జీవన విధానాన్ని,

భవిష్యత్తుని తప్పకుండా ప్రభావితం చేస్తాయి. దీనికి తోడు మంచి సావాసం, దృఢ సంకల్పం కూడా తప్పనిసరని వీళ్ళ జీవిత సంఘటనలే మనకి ఋజువు చేస్తున్నాయి" అన్నాడు.

నేనప్పుడన్నాను "వంశీ! నాకు అర్ధం కావడం లేదు. సంస్కారము, మంచి నడవడిక తల్లిదండ్రుల సరైన పెంపకం వల్లనే వస్తాయా? లేక జన్మతః ప్రాప్తిస్తాయా!?"

ఇంతసేపు మా సంభాషణలు వింటున్న మా అమ్మాయి జ్యోతి వ్యంగ్యంగా అనింది

"అయ్యో నాన్నా! వీటి గురించి ఆలోచించేదెవరు? ఈ కాలంలో ఎవరికి కావాలి నాన్నా సంస్కారము ఇంకా నైతిక విలువలు? బాగా డబ్బుంటే చాలు జనాలు మెచ్చుకోవటానికి, దాసోహమవ్వటానికి. ఈ రోజుల్లో ముందు చూపు, బ్రతకనేర్చిన తెలివితేటలు ఇంకా మోసకారితనం కావాలి. ఒకవేళ తమ మోసాలతో పట్టుబడినా వీళ్ళు తిరిగి తమ ధన బలంతో బయట పడతారు. పైపెచ్చు నీరాజనాలు అందుకుంటారు"

ఇంకా జ్యోతి

"మీరు చెప్పండి తాతల తరం నుంచీ అక్రమ సంపాదన చేస్తున్న వాళ్ళ సంతానం ఏమైనా ఇబ్బంది పడుతున్నారా? అక్రమ సంపాదనతో తరతరాలు హాయిగా బ్రతికేస్తున్నారు. మనమేమైనా వీళ్ళని అక్రమ సంపాదనతో పైకొచ్చారు అని వెలివేస్తున్నామా లేక వెలివేయగలమా?

వాళ్లకి కావలసిందల్లా ముందు చూపుతో ఆ డబ్బు పోగొట్టుకోకుండా జాగ్రత్త వహిస్తే చాలు. ఈ నైతిక విలువలు, సంస్కారం లేకపోవడం అనేవేమీ వారికి అడ్డు కావు ఇంకా వాళ్ళనెవరూ ప్రశ్నించరు.

పాపం! సిగరెట్లు త్రాగడం, మందు కొట్టడమే పెద్ద నేరాలు పాత తరాల మీ బోటి వాళ్లకు. ఇక పొరపాటున జైలుకెళ్లోస్తే ఈ బడుగు జీవుల సంతానం దాని పర్యవసానం ఎంతో ఘోరంగా అనుభవించారు.

మరి ఇప్పుడో, ఈ వ్యసనాలన్నీ సర్వసాధారణం. బాగా సంపాదించి జైలుకెళ్తే అదింకా మేలే. గొప్ప రాజకీయ జీవితానికి సోపానం!

మనం వద్దనుకున్నా ఇవన్నీ ఉన్నవాళ్ళే మన నిత్య జీవితాన్ని శాసిస్తున్నారు. పెద్ద పెద్ద సాములోళ్ళే వీరికి వత్తాసు! మనమెంత? వాళ్లు తినే బిర్యానీలో మసాలా దినుసులం! పంటి కింద పడకుండా జారిపోతే అదృష్టవంతులం. క్షమించండి నన్ను. అదేదో చిన్న నోరు, పెద్ద మాట అంటారు కదా. అలాగేదో నాకు తోచినది వాగేసాను" అనింది.

ఇంతటితో ఆగకుండా జ్యోతి

"మీకు తెలుసు నేను చెప్పిందంతా కేవలం నా అభిప్రాయమే కాదు. ఇది ప్రస్తుతం మనం అనుభవిస్తున్న

పరిస్థితి.  ఇంకా మా తరం ముమ్ముందు ఎదుర్కోవలసిన గొప్ప సంకటం.  మీరు ఇది చెప్పండి.  మీ పెంపకంలో మేము తెలుసుకున్న, పాటిస్తున్న మంచి అలవాట్లు, పాప భీతి మమ్మల్నిఈ దౌర్భాగ్య పరిస్థితిని తట్టుకుని ముందుకు తీసుకెళ్తుందనే భావిస్తున్నారా"

అని తన ప్రశ్నలతో ముగించింది.  ఇవన్నీ విన్న నాకూ వంశీకి తిరిగి నోట మాట రాలేదు!!

అసలే జ్యోతి ఇచ్చిన కుదుపుకి దిమ్మ తిరిగిన నాకు మా ఆవిడ మంజరి పిలుపు ఇంకో సమస్య తెచ్చి పెట్టింది "ఏవండీ! ఇక్కడ పెరట్లో వాడిపోయిన తమలపాకు తీగె తీసేసి ప్రక్కనే మొలిచిన దాని చిన్నమొక్కలకి పాదు చేయనా" అని.

దీంతో వంశీ గట్టిగా నవ్వాడు "వామ్మో! ఇంకొన్ని స్మృతులా" అని.

అంతే! జ్యోతి కూడా వంశీతో శృతి కలిపి నవ్వుతూనే ఉంది.

దీనికి నేనెందుకు ఉడుక్కుంటున్నానో అర్థం కాక పాపం మంజరి ఆలోచిస్తోంది.

ముగింపుగా నేనన్నాను "ఐదు తరాల ఈ మలగిన జీవన స్మృతులలో గమనించాల్సిందేమిటంటే ఎన్నో గడ్డు పరిస్థితులు ఎదురైనా ఆదర్శంగా మెలిగిన మణిదీపాల్లాంటి తల్లులు ప్రతి తరంలోనూ ఉన్నార"ని.